PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 351 | విజయవాడ, శుక్రవారం 21 జూలై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 21 July 2023 | Rs

పర్మినెంట్ చేసేంత వరకూ పోరాటం

- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళనలు
- స్పందించకుంటే 27న మున్సిపల్ కార్యాలయాల ముట్టడిస్తామని హెచ్చరిక

6

మహిళా సంరక్షణ కార్యదర్శులకు

పోలీసు విధులు అప్పగించబోం

- హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న మహిళా సంరక్షణ కార్యదర్శులకు పోలీసు విధులు అప్పగించబోమని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ మేరకు అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ గురువారం న్యాయమూర్తులు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్‌కి చెప్పారు. బందోబస్తు, పిఎస్‌లలో రిసెప్షనిస్టు వంటి సాధారణ కానిస్టేబుల్ విధుల్ని మహిళా పోలీసులకు అప్పగించకుండా పోలీసులకు డిజిపి ఆదేశాలిస్తారని తెలిపారు. ఈ మేరకు విశాఖకు చెందిన ఆరేటి ఉమామహేశ్వరావు తదితరులు దాఖలు చేసిన పిల్ విచారణను డివిజన్ బెంచ్ ఈ నెల 26కు వాయిదా వేసింది.

దద్దరిల్లిన పార్లమెంట్

- మణిపూర్‌పై చర్చకు పట్టుబట్టిన ప్రతిపక్షాలు
- ఉభయ సభల్లో గందరగోళం
- నేటికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారం చేసి, నగ్నంగా ఊరేగించిన పాశవిక ఘటన, రావణకాష్టంలా రగులుతున్న హింసాకాండపై వర్షాకాల సమావేశాల తొలి రోజైన గురువారం పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. ఈ అంశాలపై చర్చ జరగాల్సిందేనని ప్రతిపక్షాలు పట్టుబట్టగా ప్రభుత్వం అందుకు తిరస్కరించింది. దీంతో ప్రతిపక్ష పార్టీల సభ్యులు ఆందోళనకు దిగడంతో ఉభయసభలు స్తంభించాయి. ఇతర సభా కార్యక్రమాలన్నీ పక్కన పెట్టి మొదటి అంశంగా మణిపూర్ సమస్యపై చర్చించాలని ప్రతిపక్షాలు ముక్త కంఠంతో డిమాండ్ చేశాయి. లోక్‌సభ సమావేశమైన ప్రారంభమైన తరువాత పంజాబ్‌లోని జలంధర్ నుంచి ఎంపిగా గెలుపొందిన ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన సుశీల్ కుమార్ రింకూ ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల మరణించిన సభ్యులకు నివాళు లర్పించిన తరువాత లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన తర్వాత మణిపూర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన వాయిదా తీర్మానాలన్నింటినీ స్పీకర్ తోసిపుచ్చినట్లు బిజెపి ఎంపి కిరీట్ సోలంకి ప్రకటించారు. దీంతో, సభలో ప్రతిపక్ష



లోక్‌సభలో గురువారం తొలిరోజున ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల ఎంపీలు

ఎంపిలు "మణిపూర్, మణిపూర్.. మణిపూర్ కాలిపోతుంది" అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మణిపూర్ హింసాకాండపై పార్లమెంటు ఉభయ సభల్లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, చర్చకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. చర్చ జరపాలంటూ ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించడంతో సభను శుక్రవారానికి వాయిదా వేసినట్లు కిరీట్ సోలంకి ప్రకటించారు.

రాజ్యసభలో ప్రతిపక్షాల డిమాండ్‌ను చైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ నిరాకరించడంతో ప్రతిపక్ష ఎంపిలు చైర్మన్ పోడియం దగ్గరకెళ్లి ఆందోళనకు దిగారు. అత్యంత సున్నితమైన ఈ అంశం ప్రాధాన్యతగా తీసుకోవాలని, దీనిపై ప్రధాని సమాధానమివ్వాలని ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గే డిమాండ్ చేశారు. ప్రధాని నోరు విప్పాలన్నారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. సభ తిరిగి ఆరంభమైన తరువాత కూడా మల్లికార్జున ఖర్గే మరోసారి తన నోటీసులపై చర్చించాలని కోరారు. మణిపూర్ తగలబడిపోతోందని, మహిళలపై అకృత్యాలు జరుగుతున్నాయని, మహిళలను నగ్నంగా ఊరేగిస్తున్నారని, ఇంత జరుగుతున్నా ప్రధాని మౌనంగా ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో సమాధానం ఇవ్వకుండా సభ బయట ప్రధాని దీనిపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడుతున్న సమయంలో ఆయన మైక్ కట్ చేయడంతో ఆయన, కాంగ్రెస్ సభ్యులు నినాదాలు చేశారు. దీంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

పార్లమెంటు సమావేశాల ప్రారంభ రోజు నేతలు ఒకరినొకరు పలకరించుకునే మిగతా 5లో



దేశానికి అవమానకరం : మోడీ

గురువారం ఉదయం పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంటు ఆవరణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మీడియాతో మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన అమానుష సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, బాధించిందని అన్నారు. ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంటుకు రావడానికి ముందు తన మనసు బాధ, ఆగ్రహంతో నిండిపోయాయని చెప్పారు. ఏ నాగరికతకైనా ఈ సంఘటన సిగ్గుచేటు అని స్పష్టం చేశారు. ఇది దేశానికి అవమానకరమని చెప్పారు. నేరాలపై, మరీ ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టాలను బలోపేతం చేయాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను కోరారు. ఇటువంటి సంఘటనలు రాజస్థాన్‌లో జరిగినా, ఛత్తీస్‌గఢ్ లేదా మణిపూర్‌లో జరిగినా.... నిందితులు దేశంలో ఏ మూలలో ఉన్నా, శిక్ష నుంచి తప్పించుకోకూడదని అన్నారు. ఏ నిందితుడినీ వదిలిపెట్టేది లేదని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నానని చెప్పారు. మణిపూర్ బిడ్డలకు జరిగిన అన్యాయానికి కారకులైన వారిని క్షమించేది లేదని స్పష్టం చేశారు.



సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్న చింతూరు మండలం కొయగురు గ్రామస్తులు

ఉధృతంగా గోదావరి, శబరి

- భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
- దేవీపట్నం మండలంలోని 32 గ్రామాల్లోకి నీరు
- సురక్షిత ప్రాంతాలకు నిర్వాసితులు

ప్రజాశక్తి - యంత్రాంగం

మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి గురువారం సాయంత్రానికి 43 అడుగులకు నీటిమట్టం చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 8.7 అడుగుల నీటి మట్టం నమోదైంది. దీంతో బ్యారేజీకి చెందిన 175 గేట్లను 0.4 మీటర్ల మేర పైకెత్తి 5,68,174 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. 11,100 క్యూసెక్కుల నీటిని పంట కాలువలకు విడుదల చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని నేరుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పోలవరం వద్ద ప్రస్తుతం 33.70 మీటర్ల నీటిమట్టం నమోదైంది. 4,49,352 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దేవీపట్నం మండలంలో 32 గ్రామాల్లోకి నీరు ప్రవేశించింది. ఈ రాత్రికి వరదనీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని ధవళేశ్వరంలోని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఇప్పటికే లంకప్రాంతాలను అప్రమత్తం చేశామని అధికారులు తెలిపారు. వరద ఉధృతి కారణంగా కె.గంగవరం మండలం కోటిపల్లి రేవును పూర్తిగా మూసివేశారు. చింతూరు వద్ద శబరి నది ప్రవాహం కూడా 30 అడుగులకు చేరడంతో శబరి రోడ్డు, సంతపాక ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు బయలుదేరారు. చింతూరు మండలం కొయుగురు వాగు రోడ్డుపై నుంచి ప్రవహించడంతో ఒడిశా - ఆంధ్ర మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. సోకిలేరు, చీకటి వాగులు రోడ్డుపై ప్రవహించడంతో చింతూరు - విఆర్.పురం మండలాలకు రవాణా స్తంభించింది.

పునరావాస కాలనీలకు తరలింపు

కూనవరం మండల మిగతా 5లో

ఏమిటీ నిర్లక్ష్యం?

- మీరు చర్యలు తీసుకుంటారా! మమ్మల్ని తీసుకోమంటారా?
- కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాల తీరుపై సుప్రీం ఆగ్రహం
- మహిళలను నగ్నంగా ఊరేగించిన ఆ వీడియో తీవ్రంగా కలచివేసింది
- సుమోటో కేసు కింద 28న విచారణ
- సిజెఐ జస్టిస్ చంద్రచూడ్



న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఇద్దరు మహిళలను రేప్ చేసి, నగ్నంగా ఊరేగించిన అమానుష విజువల్స్‌తో కూడిన వీడియో పై తీవ్రంగా కలత చెందిన సుప్రీం కోర్టు కేంద్ర, మణిపూర్ ప్రభుత్వాల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిని సుమోటో కేసుగా గురువారం పరిగణనలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం ఈ మేరకు ఆ రెండు ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. దీనిపై విచారణ ఈ నెల 28న చేపట్టాలని నిర్ణయించింది. ఈలోగా మహిళలను చెరపట్టిన ఆ కీచకులను బోనులో నిలబెడతారా? లేకుంటే మీరు పక్కకు తప్పుకుని న్యాయవ్యవస్థకు ఆ బాధ్యత విడిచిపెడతారా? ఏదో ఒకటి తేల్చి చెప్పాలని చీఫ్ జస్టిస్ డి వై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం అల్టిమేటమ్ ఇచ్చింది. ప్రభుత్వంలోని ప్రముఖ న్యాయ అధికారులైన అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ ఇద్దరినీ కోర్టుకు రప్పించి ఈ మేరకు తమ ఆందోళనను వారికి మిగతా 5లో



సెలియా గువేరా కన్నుమూత

బ్యూనస్ ఎయిర్స్ : అర్జెంటీనా మార్క్సిస్ట్ విప్లవకారుడు 'చే గువేరా' చెల్లెలు సెలియా గువేరా డి లా సెర్నా (93) బుధవారం అర్జెంటీనాలోని బ్యూనస్ ఎయిర్స్‌లో కన్నుమూశారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ అమెరికన్ ఆర్ట్ అండ్ ఈస్తటిక్ రీసెర్చ్ 'మారియో జె బుస్చియాజో', ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఆఫ్ యూనివర్సిటీ బ్యూనస్ ఎయిర్స్ సెలియా మరణాన్ని ధృవీకరించాయి. ఈ సందర్భంగా 'మా ఇనిస్టిట్యూట్‌కి ప్రిన్సిపల్, ఇన్వెస్టిగేటర్, అనేక రీసెర్చ్ ప్రాజెక్టుల డైరెక్టర్, ఆర్కిటెక్ట్, డెవలపింగ్ కంట్రీస్ స్పెషలిస్ట్ సెలియా గువేరా మరణాన్ని ప్రకటిస్తున్నందుకు మేము చింతిస్తున్నాము' అని ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ సోషల్‌మీడియా ద్వారా తెలియజేసింది. ముఖ్యంగా అనేక పరిశోధన ప్రాజెక్టులకు సెలియా డైరెక్టర్‌గా పనిచేశారని యూనివర్సిటీ గుర్తుచేసుకుంది. జిబిఎ (గ్రేటర్ బ్యూనస్ ఎయిర్స్) నార్త్ కారిడార్‌లో ఆమె అనేక శాస్త్రీయ సమావేశాల్లో పాల్గొన్నారని యూనివర్సిటీ పేర్కొంది. కాగా, బొలివియా మాజీ అధ్యక్షుడు ఇవో మోరేల్స్ సెలియా గువేరా మృతికి తన సంతాపాన్ని తెలియజేశారు.

7న ఢిల్లీలో నిర్వాసితుల ధర్నా

- తక్షణమే వరద సహాయక చర్యలు చేపట్టాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరద బాధితులకు తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం కాఫర్ డ్యామ్ కారణంగా మూడేళ్లుగా విలీన మండలాలు పూర్తిగా ముంపునకు గురౌతున్నాయన్నారు. గతేడాది వరదలకు ప్రభుత్వం తాగునీరు కూడా అందించలేకపోయిందని గుర్తు చేశారు. కొండలు, గుట్టలపైకి వెళ్లి నిర్వాసితులు ప్రాణాలు కాపాడుకున్నారని తెలిపారు. టార్పాలిన్లు, కొవ్వొత్తులు సైతం అందించలేదని విమర్శించారు. గతేడాది అనుభవాలతో అయినా ప్రభుత్వం గుణపాఠం నేర్చుకోవాలన్నారు. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిర్వాసితులకు పునరావాసం తన బాధ్యత కాదంటున్న కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు అండగా అన్ని పార్టీలు కలిసి రావాలన్నారు. జాతీయ సమస్యగా పరిగణించి ఆగస్టు 7న ఢిల్లీలో జరగబోయే ధర్నాకు తరలి రావాలని కోరారు. పోలవరంపై పార్లమెంటులో వైసిపి, టిడిపిలకు చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని కోరారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్మాణంలో తొలుత నిర్వాసితులకు న్యాయం చేయాలని సెక్షన్ 90 స్పష్టంగా చెబుతోందన్నారు. పునరావాసం కేంద్ర ప్రభుత్వం బాధ్యతేనని తెలిపారు. ప్రాజెక్టు అంచనా విలువ రూ.55 వేలకోట్లలో రూ.35 వేల కోట్లు పునరావాసానికే ఖర్చు చేయాలని తెలిపారు. ఈ గణాంకాలే పునరావాసం ప్రాధాన్యతను వివరిస్తున్నాయన్నారు. పోలవరం నిర్వాసితుల పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 1.06లక్షల కుటుంబాలల్లో 12 వేల కుటుంబాలకు మాత్రమే పరిహారం అందించారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

రాబోయే ఎన్నికల్లో పొత్తులపై ఓ విలేకరి ప్రశ్నించగా... బిజెపితో ప్రత్యక్షంగా.. పరోక్షంగా కలిసి పనిచేసే పార్టీలతో కలిసి వెళ్లబోమని శ్రీనివాసరావు స్పష్టం చేశారు. జనసేన, బిజెపిల పొత్తు ఆత్మహత్యా సదృశ్యమన్నారు. బిజెపితో పొత్తు పెట్టుకున్న అనేక ప్రాంతీయ పార్టీలు భూస్థాపితం అయ్యాయని, వర్తమాన రాజకీయాలే ఒక ఉదహరణ అని వివరించారు. యూనిఫామ్ సివిల్ కోడ్‌పై వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్, టిడిపి అధినేత చంద్రబాబు ఖచ్చితమైన అభిప్రాయం ఎందుకు చెప్పట్లేదని ప్రశ్నించారు. యుసిసిని మైనార్టీలే కాదు హిందూ మహిళలు కూడా అంగీకరించబోరన్నారు. ఆ చట్టం అమల్లో ఉన్న గోవాలోని బహుభార్యత్వాన్ని ఇందుకు ఒక ఉదాహరణగా చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కల్పించే చట్టాల అవసరం ఉందని చెప్పారు. వైసిపి, జనసేన, టిడిపిలు గోడమీద పిల్లుల్లా వ్యవహరించడం తగదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, నగర కార్యదర్శి బి.పవన్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిపై విలీనం పిడుగు

- 118 పాఠశాలలు మూత?
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల ప్రభావం పాఠశాలల మూతకు దారి తీసింది. విద్యాశాఖలో తీసుకొచ్చిన తరగతుల విలీనం విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా 118 ప్రాథమిక పాఠశాలలు మూతపడనున్నాయి. 4,234 పాఠశాలల్లో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం విలీనం చేశారు. ఈ తరగతులను తరలించడంతో మిగిలిన 1, 2 తరగతుల పిల్లల సంఖ్య తగ్గింది. కేవలం రెండు తరగతులే అక్కడ ఉండటం, పిల్లల సంఖ్య తక్కువగా ఉండటం, ఉపాధ్యాయుడు ఒక్కడే బోధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. పిల్లలు లేరని కారణం చూపుతూ 118 పాఠశాలలను మూసేయాలని విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

అనంతపురం జిల్లా హెచ్ సోదనపల్లి ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను దగ్గర్లోని ఉన్నత పాఠశాలలో గతేడాది విలీనం చేయడంతో ప్రాథమిక పాఠశాలలో 15 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది అక్కడ కొత్తగా ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. ఉన్నవారు ప్రైవేటు పాఠశాలకు వెళ్లారు. ప్రస్తుతం ఈ బడి అక్కడ నడవడం లేదు. ఇదే జిల్లా గుత్తి మండలంలోని బసినేపల్లి పాఠశాలలో కూడా విలీనం చేపట్టంతో గతేడాది 8 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పుడు కేవలం ఇద్దరు మాత్రమే ఉన్నారు. ఈ పాఠశాలను కూడా మూసేయాలని ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. గుంటూరు జిల్లాలో రాష్ట్ర సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శాఖమూరులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో కూడా విద్యార్థులు లేకపోవడంతో దీనిని కూడా మూసేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తరగతుల విలీనం చేయొద్దని, పాఠశాలలు మూతపడతాయని ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేసినా.. ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఎయిడెడ్ పాఠశాలలు మూత?

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరితో ఎయిడెడ్ పాఠశాలలు కూడా మూతపడే పరిస్థితి నెలకొంది. ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వానికి అప్పగించాలని, లేదంటే అక్కడున్న ఉపాధ్యాయులను ప్రభుత్వానికి అప్పగించి సొంతగానే నడుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. కేవలం తక్కువ సంఖ్యతో మాత్రమే ప్రభుత్వానికి ఆయా యాజమాన్యాలు అప్పగించాయి. మిగిలిన వాటిల్లో చాలామంది పాఠశాలలను నిర్వహించడం లేదు. ఉన్న విద్యార్థులను వేరే పాఠశాలకు పంపి మూసేస్తున్న పరిస్థితి ఏర్పడింది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలంలోని సెయింట్ థెరిస్సా ఎయిడెడ్ పాఠశాల, తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని శ్రీ విక్టోరియా ఎయిడెడ్ పాఠశాల, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని ఆర్‌సిఎం ఎయిడెడ్ పాఠశాలలను ఆయా యాజమాన్యాలు మూసివేసేందుకు సిద్ధమయ్యాయి. ఈ ఏడాది సుమారు 100 పాఠశాలలు మూతవేసేందుకు సిద్ధమయ్యాయి.



ఆపిల్ జిపిటి ఎఐ వస్తోంది...

న్యూయార్క్ : మానవుల ప్రమేయం లేకుండా సమాచార మార్పిడికి వీలుగా కృత్రిమ మేధా (ఎఐ) పరిశోధనలను టెక్ కంపెనీలు పోటాపోటీగా నిర్వహిస్తున్నాయి. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా లాంటి కంపెనీలు ఒక అడుగు ముందుకు వేయగా.. తాజాగా ఆపిల్ కంపెనీ కూడా జిపిటి ఎఐని ఆవిష్కరణకు కసరత్తు చేస్తోందని సమాచారం. తన కీలక డేటా సురక్షితంగా ఉండేందుకు ఆపిల్ తన ఉద్యోగులను చాట్‌జిటిపి వంటి ఎఐ టూల్స్‌ను వాడేందుకు అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలోనే తమకంటూ ప్రత్యేకంగా ఎఐ టూల్స్ ఉండాలనే ఉద్దేశ్యంతో కసరత్తు చేస్తోందని.. ఈ క్రమంలోనే సొంత జిపిటి ఎఐని తీసుకొస్తుందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది.

పవన్ కల్యాణ్‌పై పరువునష్టం కేసు

- ఉత్తర్వులు జారీచేసిన అజయ్‌జైన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



వలంటీర్లపై వ్యాఖ్యలు చేసిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై పరువు నష్టం కేసు నమోదు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. పవన్‌పై కేసు నమోదు చేయాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించారు. వలంటీర్లను, ఆ విభాగంలో పనిచేస్తున్న మహిళలను కించపరిచేలా పవన్ కల్యాణ్ వాఖ్యలు ఉన్నాయని, అవమానకరమైన, విషపూరిత వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు అందులో పేర్కొంది. ఈ మేరకు సెక్షన్ 199/4 కింద కేసు నమోదుకు ఆదేశించడంతోపాటు నోటీసును మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో అందించారు. నిరంతరం ఇంటింటికీ తిరిగి సేవలు చేస్తున్న ఈ వ్యవస్థకు దురుద్దేశాలు ఆపాదించారని నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 9న ఏలూరులో జరిగిన వారాహి విజయయాత్రలో వలంటీర్లపై పవన్ కల్యాణ్ పలు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో 29 వేలమంది మహిళలు మిస్సయ్యారని, వారిలో 14 వేలమంది ఆచూకీ ఉందని, మిగిలిన వారి ఆచూకీ తెలియడం లేదని, ఎన్‌సిఆర్‌బి నివేదికలో ఈ విషయాలు తెలిశాయని విమర్శించారు. అలాగే వలంటీర్లు ఇళ్లలోకి వెళ్లి ఒంటరి మహిళల వ్యక్తిగత సమాచారం సేకరిస్తున్నారని, ఈ డేటా ఎవరి వద్దకు వెళుతుందో కూడా తెలియదని పేర్కొన్నారు. అజయ్ జైన్ జారీచేసిన నోటీసులో ఈ అంశాలన్నిటినీ ప్రస్తావించారు. విమర్శలు చేస్తే కేసులు నమోదు చేయడం సరైన పద్ధతి కాదని సీనియర్ న్యాయవాదులు చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు చేసే హక్కు ఉందని, తప్పని తేలితే చెప్పాలి తప్ప కేసులు నమోదు చేసి వేధించడం సరికాదని పేర్కొన్నారు.

అరెస్టు చేసుకోండి పవన్

తాను దెబ్బలు తినడానికి రెడీగా ఉన్నానని, అరెస్టు చేసుకోవచ్చని జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ తెలిపారు. కేసు నమోదు చేసినంత మాత్రాన భయపడేది లేదని అన్నారు. డేటా చౌర్యం ప్రమాదకరమైందని హెచ్చరించారు. సేకరించిన డేటా ఎక్కడకు వెళుతుందో, ఎవరికి చేరుతుందో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలన్నిటినీ కేంద్ర హోంశాఖ దగ్గరకు తీసుకెళతానని పవన్ తెలిపారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు ఆగస్టు 17

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ఆగస్టు 17తో ముగియనుందని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. మూడో (తుది) దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 17 నుంచి ప్రారంభమైందని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగస్టు 17 వరకు అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తుందని, ఆ తర్వాత పొడిగించడం ఉండదని స్పష్టం చేశారు.

పండిట్ పోస్టులు భర్తీ చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు కోరారు. పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) మువ్వా రామలింగంతో గురువారం ఈ అంశంపై ఎమ్మెల్సీ చర్చించారు. సుమారు 1,400 తెలుగు, హిందీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ నియామకాలపై ఉన్న కోర్టు కేసులను క్లియర్ చేయాలని కోరారు. ప్రమోషన్లు, నియామకాలకు నూతన సర్వీస్ రూల్స్ రూపొందించే అంశంపై చర్చించామని రామలింగం చెప్పారు. ఎన్‌సిటిఇ మార్గదర్శకాలకు అనుగుణంగా నూతన సర్వీస్ రూల్స్ రూపొందిస్తామని, ఇందుకు అనుగుణంగా కోర్టు క్లియరెన్స్ తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

జెపి నడ్డాతో పవన్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాను జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిశారు. సుమారు గంటంపావుకు పైగా ఇరువురి నేతల మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికలకు సమాయత్తం అవ్వాల్సిన వ్యవహారంపై చర్చించినట్లు సమాచారం. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులను కూడా జెపి నడ్డా దృష్టికి పవన్ తీసుకెళ్లినట్టు తెలిసింది. టిడిపి, బిజెపి, జనసేన కలిసి ఎన్నికల్లో పోటీ చేయాలనే దానిపై కూడా పవన్ మరోసారి లేవనెత్తారు. టిడిపి ఉండాల్సిందేనని స్పష్టం చేసినట్లు సమాచారం. భేటీ అనంతరం పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటన ముగించుకుని విజయవాడ బయలుదేరారు.

కులగణనలో జనగణన చేపట్టాలనే నిర్ణయంపై హర్షం

- మల్లికార్జున ఖర్గేను కలిసిన బిసి సంఘం నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బెంగళూరులో 26 పార్టీల నేతలు నిర్వహించిన భారత జాతీయ ప్రజాస్వామ్య సమ్మిళిత కూటమి సమావేశంలో తీసుకున్న జనగణన చేపట్టాలనే నిర్ణయంపై జాతీయ బిసి సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు గురువారం నాడిక్కడ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను బిసి సంఘం నేతలు కలిశారు. పార్లమెంటులో బిసి బిల్లు కోసం, బిసిల వివిధ డిమాండ్లపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఖర్గేను కలిసిన వారిలో రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం కన్వీనరు జి కృష్ణ, అధికార ప్రతినిధి, ఢిల్లీ ఇన్‌ఛార్జి కె వేణుమాధవ్, నందగోపాల్, రాజ్ కుమార్, బాషయ్య తదితరులు ఉన్నారు.

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకే పవన్‌కల్యాణ్‌పై కేసు

మాజీ మంత్రి పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వలంటీర్ల మనోస్థైర్యం దెబ్బతినేలా తప్పుడు ఆరోపణలు చేస్తున్నందునే రాష్ట్ర ప్రభుత్వం పవన్‌కల్యాణ్‌పై కేసు పెట్టాలని నిర్ణయించిందని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. వలంటీర్లు డేటా చోరీ చేస్తున్నారని గగ్గోలు పెడుతున్న పవన్‌కల్యాణ్ టిడిపి హయాంలో ప్రజాసాధికార సర్వేను హైదరాబాద్‌లో అమ్మకానికి పెట్టినప్పుడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం ఎక్కడా డేటా చోరీ చేయలేదని తెలిపారు. పవన్‌కల్యాణ్ కూడా జనసేన సభ్యత్వం పేరుతో అన్ని వివరాలూ తీసుకుంటున్నారని, ఆ వివరాలను ఎవరికి అమ్ముతున్నారో చెప్పాలన్నారు. అమిత్ షా, మోడీతో సత్సంబంధాలున్నాయని చెబుతున్న పవన్‌కల్యాణ్‌కు చిత్తశుద్ధి వుంటే డేటా చోరీపై కేంద్ర సంస్థలతో విచారణ జరిపించాలని సవాల్ చేశారు. పవన్‌కు మాటలు ఎక్కువ, చేతలు తక్కువ అని విమర్శించారు.

ఉన్నత విద్యలో మరిన్ని సంస్కరణలు

- ఫ్యూచర్ టెక్నాలజీపై కార్యాచరణ
- సిఎం జగన్‌మోహన్‌రెడ్డి



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్నత విద్యలో మరిన్ని సంస్కరణలను తీసుకురావాల్సిన అవసరం వుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైపవర్ వర్కింగ్ గ్రూప్‌తో సమావేశమయ్యారు. విద్యాశాఖ అధికారులు, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, నాస్కామ్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, డేటావివ్ వంటి ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. విద్యారంగంలో కీలక మార్పులపై సమాలోచనలు, కార్యాచరణకు ఈ సందర్భంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, పాఠ్యప్రణాళిక రూపకల్పన, బోధన తదితర అంశాలలో ఫ్యూచర్ టెక్నాలజి పద్ధతులతో కార్యాచరణ తయారు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య, ఉన్నత విద్యపై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. పాఠశాల దశ నుంచి ఉన్నత విద్య వరకు ఈ రెండింటిని అనుసంధానం చేయాలన్నారు. పాఠ్య ప్రణాళికను కూడా సమ్మిళితం చేయాలని ఆదేశించారు. ఉన్నత విద్యలో మరింత మెరుగైన సంస్కరణలు అవసరమని అన్నారు. ఇండియాలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్(ఎఐ)వంటి వర్టికల్స్ అభివద్ధి చాలా తక్కువగా వుందని భవిష్యత్ అంతా ఎఐదేనని అన్నారు. బికామ్‌లో ఫైనాన్స్‌కు సంబంధించిన బోధన ఆధునిక పద్ధతుల్లో లేవని విదేశాల్లో ఈ విభాగంలో మెరుగైన బోధన పద్ధతులు వున్నట్లే రాష్ట్రంలో కూడా తీసుకురావాలని అన్నారు. పెద్ద సంఖ్యలో స్కూళ్లు, కాలేజీల్లో ఈ కరిక్యులమ్‌ని తీసుకునిరావాలన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 6వ తరగతి నుంచి తరగతి గదుల డిజిటలైజేషన్ ప్రక్రియను చేపట్టామని అన్నారు. ప్రతి తరగతి గదిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డిసెంబర్ చివరినాటికి మొత్తం 63వేల తరగతి గదులలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. 3వ తరగతి నుండే సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టామని, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు కూడా ఇస్తున్నామని తెలిపారు. పాఠశాల స్థాయిలో కూడా బోధనతో పాటు బోధనా విధానాలు కూడా ఎలా మార్పు తీసుకురావాలన్నది ముఖ్యమైన అంశమని అన్నారు. స్టేట్ సిలబస్, నేషనల్ సిలబస్, సిబిఎస్‌ఈ లాంటి వాటికే పరిమితం కాకుండా . ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను ఒడిసి పట్టుకోవాలని సూచించారు. ఈ మార్పులన్నీ ప్రభుత్వ స్కూళ్లలో చదువుకుంటున్న పేదవిద్యార్థుల కోసం చేస్తున్నామని అన్నారు. ఈ మార్పులన్నీ పేదపిల్లలకు అందించగలిగితే అదే అది గొప్ప మార్పు అవుతుందని అన్నారు. దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే నూటికి నూరు శాతం ఫీజురీయింబర్స్‌మెంట్ అమలవుతోందని తెలిపారు. . ఇంజనీరింగ్, మెడిసిన్ విద్యలో సాంప్రదాయ విధానాలు కాకుండా మార్పులు రావాల్సిన అవసరం వుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సిఎస్ డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, పాఠశాల విద్య కమిషనర్ కాటమనేని భాస్కర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

- రాష్ట్ర వ్యాప్తంగా విఆర్‌ఎల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పే స్కేల్, డిఎతో కూడిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యాన విఆర్‌ఎలు రాష్ట్ర వ్యాప్తంగా తహశీల్దార్ కార్యాలయాల వద్ద గురువారం ఆందోళనలు చేశారు. విఆర్‌ఎలకు ఉద్యోగోన్నతి కల్పించాలని, నామినీగా పని చేస్తున్న వారిని విఆర్‌ఎలుగా నియమించాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరులో వర్షంలోనే విఆర్‌ఎలు నిరసన తెలిపారు. ఉప్పలగుప్తం, కపిలేశ్వరంలో ధర్నాలు చేశారు. కాకినాడ జిల్లా ప్రతిపాడులో విఆర్‌ఎల ధర్నాకు కాంగ్రెస్, జనసేన నాయకులు మద్దతు తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరి, పెద్దదోర్నాల, వెలిగండ్లలో నిరసనలు తెలిపి అధికారులు వినతి పత్రాలు అందజేశారు. ఏలూరు జిల్లా బుట్టాయగూడెం, నూజివీడులో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఆందోళనలు నిర్వహించి వినతిపత్రాలు అందించారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, నంద్యాల జిల్లాల్లో దీక్షలు చేపట్టారు. పలు చోట్ల నిరసన తెలిపారు. కర్నూలు జిల్లా తుగ్గలిలో ధర్నా చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో విఆర్‌ఎలు దీక్షలకు దిగారు. నెల్లూరు, కడప, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ధర్నాలు చేశారు. చిత్తూరు జిల్లా రామకుప్పం, చిత్తూరు, జీడీ నెల్లూరు, కార్వేటినగరం, పెనుమూరు, పలమనేరు, రొంపిచెర్లల్లో నిరసన దీక్షలు జరిగాయి. అనకాపల్లి జిల్లాలో తహశీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఆందోళనలు చేశారు. సిఐటియు నేతలు సంఘీభావం తెలిపారు.

వైద్యవిద్య వ్యాపారం సిగ్గుచేటు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైద్యవిద్య సీట్ల భర్తీలో ప్రభుత్వం వ్యాపారానికి ఎర్ర తివాచి పరిచి బలహీనవర్గాల విద్యార్థులను దూరం చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ విమర్శించింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వేలకోట్లు ఖర్చు చేసి ఐదు వైద్య కళాశాలలను ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిందని తెలిపారు. ఇప్పుడు ఆ కళాశాలలను వ్యాపార కేంద్రాలుగా తయారుచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జిఓల ద్వారా తేటతెల్లమవుతుందని పేర్కొన్నారు. మూడు కేటగిరీలుగా సీట్లను భర్తీ చేసి వాటిల్లో 50 శాతం సీట్లను సెల్ఫ్‌ఫైనాన్స్, ఎన్‌ఆర్‌ఐ కోటా కేటాయించడంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు ద్రోహం చేస్తుందని విమర్శించారు. 25 శాతం మాత్రమే రిజర్వ్ సీట్లను కేటాయించడం ఏమిటని, విద్యలో విప్లవాత్మకమైన మార్పులంటే బలహీన వర్గాల ప్రజలకు విద్యను దూరం చేయడమేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో డబ్బున్నవారికి, పేదలకు యుద్ధం జరుగుతుందని చెప్తున్న సిఎం సీట్ల కేటాయింపుతో ఎవరి పక్షమో ప్రజలకు అర్థమైందని తెలిపారు. పేదలను వైద్యవిద్యకు దూరం చేసే ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్యవిద్యను అందించేందుకు కృషి చేయాలని లేదంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.


జాడలేని మినీ విద్యుత్ ప్లాంట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో మినీ విద్యుత్ ప్లాంట్ల జాడ కనిపించడం లేదు. ఎంత విద్యుత్ ఉత్పత్తి సాధించినా, రాష్ట్ర ప్రజల అవసరాలకు సరిపోని పరిస్థితుల్లో సాంప్రదాయేతర విద్యుత్‌పై దృష్టి సారించాలని దశాబ్దాల కాలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడంలో అవి విఫలమవుతున్నాయి. రెండేళ్లుగా కేవలం 91 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి మాత్రమే రాష్ట్రంలో ఈ రంగంలో జరిగిందంటే ఏ స్థాయిలో నిర్లిప్తత ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రధాన విద్యుత్ వనరులుగా ఉన్న జల విద్యుత్, థర్మల్ విద్యుత్ మినహా మిగిలిన అనేక వనరులు వినియోగానికి దూరంగా ఉంటున్నాయి. సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి వనరులుగా ఉన్న పవన విద్యుత్, సౌర విద్యుత్‌తోపాటు చిన్న వాగులపై ఏర్పాటుచేసే మినీ జల విద్యుత్ కేంద్రాలు అక్కరకు రాకుండా పోతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం సీమ జిల్లాల్లో కీలకంగా ఉన్న పవన విద్యుదుత్పత్తి ఇప్పుడు నిరాశజనకంగా మారింది. ఈ రెండేళ్లలో సౌర విద్యుత్ ద్వారా కేవలం 91 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి జరిగినట్లు తేలింది. గతేడాది 83 మెగావాట్లు ఉత్పత్తి జరగ్గా, ఈ ఏడాది ఇప్పటివరకు కేవలం ఎనిమిది మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేయగలిగారు. మిగిలిన రంగాల్లో మాత్రం ఒక్క మెగావాట్ కూడా ఉత్పత్తి లేకపోవడం గమనార్హం. మినీ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం ఎన్నో ప్రోత్సాహకాలను ఇస్తామని ప్రకటనలు చేస్తున్నప్పటికీ పారిశ్రామికవేత్తలు మాత్రం ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇక బయోమాస్ ద్వారా విద్యుదుత్పత్తి, మున్సిపాల్టీల్లో సాలిడ్ వేస్ట్, పారిశ్రామిక వ్యర్థాల ద్వారా తయారుచేసే విద్యుత్ కూడా కనిపించడం లేదు.

విశాఖలో అంతర్జాతీయ ఇరిగేషన్ సదస్సు

- కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీళ్లు
- మంత్రి అంబటి రాంబాబు



25వ ఐసిఐడి సదస్సు బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మంత్రి అంబటి, ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఐసిఐడి ప్రతినిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వ్యవసాయ రంగంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనే అంశాలపై ఈ ఏడాది నవంబరు 1 నుంచి 8 వరకు విశాఖపట్నంలో ప్రతిష్టాత్మకంగా ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసిఐడి) సదస్సును నిర్వహించనున్నట్లు జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. 80 దేశాల నుంచి ప్రతినిధులు హాజరయ్యే ఈ అంతర్జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతిని, ప్రధాన మంత్రిని ఆహ్వానిస్తున్నామన్నారు. గురువారం విజయవాడలోని జలవనరులశాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర జలవనరులశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్, ఇఎన్‌సి నారాయణరెడ్డితో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. 1951లో మనదేశ ప్రోద్భలంతో మొదటిసారి 11 దేశాలతో ఐసిఐడి సదస్సు జరిగిందని తెలిపారు. ఆ తర్వాత 1966లో జరిగిందని, 57 ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ మనమే నిర్వహిస్తామని అన్నారు. 80 దేశాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరయ్యే ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 700 మంది సాగునీటి రంగ నిపుణులు హాజరవుతారని తెలిపారు.

కృష్ణా నదిలో నీటి లభ్యత లేకపోవడం వల్ల కృష్ణా డెల్టాకు పట్టిసీమ నీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు అంబటి రాంబాబు వెల్లడించారు. నాగార్జున సాగర్ కుడికాల్వ కింద వున్న ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ఐదు టిఎంసిల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పులిచింతలలో వున్న నీరు విడుదల చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడతాయనే పట్టిసీమ నుండి నీటిని విడుదల చేస్తున్నామని అన్నారు.

గోదావరి వరదల పట్ల అప్రమత్తం

గోదావరి నదిలో వరద ఉధృతి పెరుగుతోందని అధికార యంత్రాంగం యావత్తు అప్రమత్తంగా వుండాలని మంత్రి అంబటి రాంబాబు ఆదేశించారు. ప్రస్తుతం పోలవరం స్పిల్ వే నుంచి ఐదు లక్షల క్యూసెక్కుల వరద వెళ్తోందని తెలిపారు. ఆ ప్రవాహం ఎనిమిది లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అన్నారు. పోలవరంలో డయాఫ్రం వాల్ కొన్నిచోట్ల దెబ్బతిందని, కొత్తది నిర్మించాలా లేక పాత దానికే మరమ్మతులు చేయాలా అన్నది త్వరలో నిర్ణయిస్తామని అన్నారు. దీనిపై కేంద్ర జల సంఘానికి ఇంకా నివేదిక ఇవ్వలేదన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై

ప్రతి వారమూ పార్టీలకు సమాచారం

- వలంటీర్లు ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోరు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఎంకె మీనా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ప్రతి వారమూ రాజకీయ పార్టీలకు నియోజకవర్గ స్థాయిలో సమాచారం అందిస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. లోపాలు లేని ఓటర్ల తుది జాబితా కోసం ఈ అవకాశాన్ని రాజకీయ పక్షాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురువారం సచివాలయంలోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పక్షాలతో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా ఓటరు నమోదు దరఖాస్తుల పరిష్కారం, బిఎల్‌ఒల పాత్ర, ఇఆర్‌ఒలు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి జారీ చేసిన ఏకీకృత సూచనలను రాజకీయ పార్టీల దృష్టికి తీసుకొచ్చారు. ఇఆర్‌ఒలు ప్రతి వారమూ క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాను నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీలకు అందిస్తారని, దానినే సిఇఒ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామని ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తొలుత ప్రత్యేక ఓటర్ల సవరణ షెడ్యూల్‌ను వివరించిన మీనా, 2024 జనవరి 1 అర్హత తేదీగా నిర్ధారించామని, జులై 21 నుంచి బూత్ లెవల్ ఆఫీసర్ల ద్వారా ఇంటింటి వెరిఫికేషన్ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇంటింటి సర్వే సమయంలో బిఎల్‌ఒ యాప్‌లో సమాచారాన్ని అప్‌డేట్ చేస్తారన్నారు. ఇంటింటి సర్వే సమయంలో బూత్ లెవల్ ఏజెంట్లు బిఎల్‌ఒలతో కలిసి వెళ్లొచ్చన్నారు. ఇంటింటి సందర్శనల షెడ్యూల్‌ను జిల్లా స్థాయిలోని రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. బిఎల్‌ఒలు జులై 21న ఇప్పటికే ఉన్న సమాచారాన్ని అధికారికంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో పంచుకుంటారని, ఇంటింటి ధ్రువీకరణ పూర్తయిన తర్వాత, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ జరుగుతుందన్నారు. పోలింగ్ స్టేషన్లకు సంబంధించిన ఏదైనా సమస్య ఉంటే రాజకీయ పార్టీలు జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావచ్చని, వారు పోలింగ్ స్టేషన్ల ప్రతిపాదనలను సిఇఒకు పంపుతారని ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. అక్టోబరు 17న ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ ప్రచురించి, వాటిపై క్లెయిమ్‌లు, అభ్యంతరాలు నవంబరు 30 వరకు స్వీకరిస్తారన్నారు. ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. బిఎల్‌ఒ పరిశీలన సమయంలో వలంటీర్లను దూరం పెట్టాలని టిడిపి కోరగా, ఇందుకు సంబంధించి ఇప్పటికే వలంటీర్లను ఎన్నికల ప్రక్రియలో ఎక్కడా వినియోగించరాదనే మార్గదర్శకాలు ఉన్నాయని మీనా తెలిపారు. బిఎల్‌ఒలుగా తాత్కాలిక ఉద్యోగులను నియమించరాదని కాంగ్రెస్ పార్టీ కోరగా, ఎన్నికల సంఘం నిబంధనావళి మేరకు శాశ్వత ఉద్యోగులనే నియమించామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుగులో అందించాలని సిపిఎం కోరింది. ఈ సమావేశంలో వైసిపి నుంచి మూర్తి, టిడిపి నుంచి వర్ల రామయ్య, కోనేరు సురేష్, సిపిఎం నుంచి వై వెంకటేశ్వరరావు, జె జయరామ్, బిజెపి నుంచి వి హేమంత్ కుమార్, కాంగ్రెస్ నుంచి వి గురునాథం, వి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



హాలహర్విలో పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

252 మందికి ఒకే ఉపాధ్యాయుడు

- పాఠశాలకు తాళం వేసిన విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - హాలహర్వి , వి. కోట

252 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయుడే పాఠం చెబుతున్నారు. తమ చదువులు కుంటుపడుతున్నాయని, ఉపాధ్యాయులను కేటాయించాలని స్పందనలో విద్యార్థులు మొరపెట్టుకున్నారు. 20 రోజులైన అధికారులు కనికరించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సంఘటన కర్నూలు జిల్లా హాలహర్వి మండలం నిట్రవట్టి గ్రామంలో చోటు చేసుకుంది. నిట్రవట్టి గ్రామ ఎంపిపి పాఠశాలలో 252 విద్యార్థులు ఉన్నారు. ఈ పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు అవసరం. కానీ ప్రధానోపాధ్యాయులు ఒక్కరే పాఠం చెబుతున్నారు. ఓ వైపు విద్యార్థులు లేక చాలా పాఠశాలలు మూత పడుతుంటే తమ గ్రామంలో విద్యార్థులు ఉన్నా, ఉపాధ్యాయులు లేక మూతబడుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ గ్రామంలోని పాఠశాలకు తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. అంతవరకు వేసిన తాళం తీసేది లేదని తేల్చిచెప్పారు.

బాధ్యతలు చేపట్టని ఉపాధ్యాయుడు

చిత్తూరు జిల్లా వి.కోట మండల పరిధిలోని ఎంఎంకుంట ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో దాదాపు 20 మంది విద్యార్థులు చదువుతున్నారు. గురువారం ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆగ్రహించిన గ్రామస్తులు పాఠశాలకు తాళం వేశారు. అరకొర ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలకు నగరి నుంచి ఎంఎం కుంటకు ఉపాధ్యాయులను బదిలీ చేయగా వారు బాధ్యతలు స్వీకరించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని ఎంఇఒ చంద్రశేఖర్ తెలిపారు.

'ఉక్కు' పరిరక్షణకు ఐక్య పోరాటాలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహించనున్నామని స్టీల్‌ప్లాంట్ ఒబిసి సంఘం నాయకులు అప్పారావు అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 889వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఉక్కు పరిరక్షణ పోరాటానికి మద్దతు పెరుగుతోందని తెలిపారు. దీక్షా శిబిరానికి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలి వస్తున్నారని తెలిపారు. మున్ముందు రాష్ట్రంలోని రైతు, ప్రజా సంఘాలను కలుపుకుని పోరాటాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. ప్రతి జిల్లాలోనూ సమావేశాలు నిర్వహించి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ప్రాధాన్యతను తెలియజేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలను పోరాటాలతో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు మోడీ ప్రభుత్వం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షా శిబిరంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, స్టీల్ కోకో ఓవెన్ విభాగం ప్రతినిధులు వైఎల్.నాయుడు, వెంకటేష్, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హిందూపురంలో దారుణం

- సహజీవనం చేస్తున్న వ్యక్తితో కలిసి బిడ్డకు వాతలు పెట్టిన తల్లి

ప్రజాశక్తి - హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మండలం బసవేశ్వర కాలనీలో గురువారం దారుణ ఘటన వెలుగు చూసింది. సహజీవనం చేస్తున్న వ్యక్తితో కలిసి ఆరేళ్ల బాలికకు వాతలు పెట్టంది ఓ కన్నతల్లి. ఇంట్లో మూత్రవిసర్జన చేసిందన్న ఆక్రోశంతో వారిద్దరూ ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు తెలిపిన వివరాల మేరకు..హిందూపురం మండలం బసవేశ్వర కాలనీలో ఆరేళ్ల బాలిక తన తల్లి అమృతతో కలిసి నివసిస్తోంది. అమృత భర్త మరణించడంతో మణికంఠ అనే వ్యక్తితో ఆమె సహజీవనం చేస్తోంది. అనుకోకుండా చంద్రిక తమ ఇంట్లోనే మూత్రవిసర్జన చేసింది. దీంతో ఇనుప కడ్డీని కాల్చి చంద్రికకు అమృత, మణికంఠ వాతలు పెట్టారు. తీవ్ర నొప్పితో బాలిక పాఠశాలకు వెళ్లింది. పాఠశాలలో కూర్చొలేని స్థితిలో ఉన్న చిన్నారిని చూసి ఉపాధ్యాయులు ఆరా తీశారు. జరిగిన విషయాన్ని చిన్నారి ఉపాధ్యాయులకు తెలియజేసింది. వెంటనే వారు ఐసిడిఎస్, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి చేరుకుని బాలికను చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

అన్ని కులాల వారిని అర్చకులుగా నియమించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిటిడి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వేద పాఠశాలల్లో అన్ని కులాల వారికీ శిక్షణ ఇవ్వాలని, వారిని అన్ని ఆలయాల్లోనూ అర్చకులుగా నియమించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి గురువారం సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి లేఖ రాశారు. తమిళనాడు ప్రభుత్వం ఇదే తరహా నిర్ణయం తీసుకుందని, రాష్ట్రం కూడా అమలు చేయాలని కోరారు. ఆలయ అర్చకులుగా ఏ కులానికి చెందిన వారైనా ఉండొచ్చని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తమిళనాడు ప్రభుత్వం సామాజిక న్యాయం తీసుకురావడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలో ఆలయాల్లోకి దళితులను రానివ్వని ప్రాంతాలు చాలా ఉన్నాయని, కర్నూలు జిల్లాలో దీనిపై ప్రతిఘటన పోరాటం కూడా జరిగిందని అన్నారు. తమిళనాడు, కేరళ, రాజస్థాన్ ప్రభుత్వాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఆలయాల్లో అన్ని కులాల వారిని అర్చకులుగా నియమించాలని కోరారు.

మణిపూర్ హింసాకాండ వెనుక ఎన్‌డిఎ కుట్ర

- సిపిఐ నేత నారాయణ విమర్శ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్‌లో హింసాకాండ వెనుక ఎన్‌డిఎ కుట్ర దాగుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ విమర్శించారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ మణిపూర్ ఆరని కార్చిచ్చులా మండుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ వ్యవస్థలకు భూములు కట్టబెట్టేందుకు ఇలాంటి హింసాత్మక కుట్రలకు తెర దీశారా అనే సందేహం కలుగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే 55 వేల ఎకరాల భూమిని అదానీకి ఇచ్చారని, మైతి, కుకి తెగలకు మధ్య కొట్లాట పెట్టారని విమర్శించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పార్లమెంటు లోపల చెప్పాల్సిన అంశాన్ని బయట చెప్తున్నారని తప్పుబట్టారు. సేవ్ మణిపూర్ పేరిట 26న దేశ వ్యాప్తంగా మణిపూర్‌కు మద్దతుగా ఆందోళన చేపడతామని తెలిపారు.

ట్రోల్ చేసినా ఏమీ కాదు..

జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయంగా స్థిరత్వం లేని వ్యక్తి అంటూ విమర్శలు చేసిన నేపథ్యంలో తనపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని నారాయణ పేర్కొన్నారు. ఇలాంటి వాటి వల్ల తనకు ఏమీ కాదన్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనపై ఆయనర స్పందిస్తూ నాడు పాచి లడ్డూలు ఇచ్చారంటూ బిజెపిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పవన్ ఇప్పుడు అదే బిజెపి పంచన ఎందుకు చేరారో చెప్పాలని నిలదీశారు. బిజెపి, టిడిపితో కలిసి వైసిపిని ఓడించాలని పవన్ అనుకుంటున్నారని అన్నారు. బిజెపితో కలుస్తానని టిడిపి అధినేత చంద్రబాబు ఎక్కడా చెప్పలేదని, కానీ పవన్ మాత్రం బిజెపి, టిడిపి, జనసేన మూడు కలవాలని సంధానకర్తగా మారారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీతో కలవడం, ఇతర పార్టీలనూ అందులోనే కలవాలని సంధానకర్తగా వ్యవహరించడం సరికాదన్నారు. వైసిపి అధినేత, ముఖ్యమంత్రి జగన్ కూడా బిజెపిని నిలదీసే చేవ లేదని, అదానీకి విశాఖ స్టీల్‌ను కారుచౌకగా కట్టబెట్టేందుకు కేంద్రం కుట్ర పన్నుతున్నా అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదని ఆయన విమర్శలు గుప్పించారు.

ముంపు గ్రామాల నిర్ధారణకు రీ సర్వే

- సిపిఎం డిమాండ్
- విధాన అంశాలు ప్రభుత్వానికి నివేదిస్తా

వ్యక్తిగత, సామూహిక సమస్యల పరిష్కారానికి ప్రయత్నం

పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య హామీ

ధవళేశ్వరంలో నిర్వాసితుల సమస్యలపై రెండవ సమావేశం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి



పోలవరం ప్రాజెక్టు వాస్తవ ముంపు నిర్ధారణకు రీ సర్వే చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. నిరుడొచ్చిన వరదల తర్వాత లైడార్ సర్వే చేయగా తొలిదశగా చెపుతున్న +41 మీటర్ల కాంటూర్‌లో ఇంతకుముందు పేర్కొన్న ఆవాసాలకు అదనంగా 48 ఆవాసాలు చేర్చారని, ఈ అనుభవం రీత్యా రీ సర్వే చేయాలని కోరింది. కాగా విధాన పరమైన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తానని, నిర్వాసితులెదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను నిర్దిష్టంగా తెలిపితే తన పరిధిలో పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ (అడ్మినిస్ట్రేటర్) ప్రవీణ్ ఆదిత్య హామీ ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం పోలవరం నిర్వాసితులతో స్పెషల్ కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం 'పోలవరం నిర్వాసితుల పోరుకేక' పేరిట సిపిఎం మహాపాదయాత్ర, ఈ నెల 4న విజయవాడలో మహాధర్నా నిర్వహించింది. స్పందించిన ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది. తొలి సమావేశం ఈ నెల 5న విజయవాడలో మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన జరిగింది. రెండో భేటీ రాజమండ్రి పిఒ కార్యాలయంలో నిర్వహించాలని స్పెషల్ కలెక్టరుకు సూచించారు ఆ మేరకు గురువారం ధవళేశ్వరంలో సమావేశం జరిగింది. సిపిఎం నుంచి పాల్గొన్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ కాంటూర్ లెక్కల ఆధారంగా నిర్ణయించిన ముంపు గ్రామాలను దాటి అదనపు ఆవాసాలకు నిరుడు వరదొచ్చిందని, రీ సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది వరదలొస్తున్నాయని, నిర్వాసితులు భయాందోళనలో ఉన్నారని, ముందస్తు సహాయ, పునరావాస చర్యలు చేపట్టాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'వరదపై మీరు టెక్నికల్‌గా మాట్లాడుతున్నారు మేం ప్రాక్టికల్‌గా చెపుతున్నాం. మీ కాంటూర్ లెక్కలను విభేదిస్తున్నాం. ఫేజ్ వన్‌పై రీ సర్వే చేయాలి' అని అన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీకి 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టు పూర్తయ్యే నాటి కటాఫ్ తేదీ పెట్టాలన్నారు. ఈ సమావేశం మొదటిదని సమస్యలు పరిష్కారమయ్యేవరకు వస్తూనే ఉంటామన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యలపై మనసు పెట్టాలని, వాళ్ల సుదీర్ఘ పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. మరో ఎంఎల్‌సి ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసితులు సమస్యలు చెప్పుకోడానికి ఈ సమావేశం మంచి వేదికని, వారి ఇబ్బందులు అర్థమయ్యాయని తెలిపారు. సిపిఎం రంపచోడవరం కార్యదర్శి బి.కిరణ్, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, ముంపు మండలాల నుంచి వచ్చిన సిపిఎం ప్రతినిధులు, నిర్వాసితులు సమస్యలను స్పెషల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.



హాజరైన నిర్వాసితుల ప్రతినిధులు, మాట్లాడుతున్న స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్‌ఆదిత్య

ప్రాధాన్యతాక్రమంలో ఆర్ అండ్ ఆర్

మూడు గంటలకుపైగా వాటన్నింటినీ ఓపిగ్గా విన్న స్పెషల్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య సానుకూలంగా స్పందించారు. సమస్యలను గుర్తించే తాజాగా లైడార్ సర్వే చేసి +41 కాంటూర్‌లో అదనంగా 48 ఆవాసాలను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుకు ప్రాధాన్యత కల్పించాం. కేంద్రం అంగీకరించాలి. బడ్జెట్ నిధులు అందుబాటు బట్టి తొలిదశ నిర్వాసితులకు పరిహారం వేస్తున్నాం. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ గ్రామాలన్నింటికీ దశలవారీగా ప్రాధాన్యతా క్రమంలో ఆర్ అండ్ ఆర్ అమలు చేస్తాం. గిరిజనులకు భూమికి భూమి పరిహారంపై సాగులో ఉండి డి ఫామ్ పట్టాలు కూడా లేని వారిని గ్రామ సభ తీర్మానం చేసి పంపితే పరిశీలిస్తాం. పోడు, ఆర్ఒఎఫ్ఆర్ భూములకూ పరిహారం ఇవ్వాలని 2013 భూసేకరణ చట్టంలో ఉన్నప్పటికీ రూల్స్ రాలేదు. కేంద్రానికి రాశాం. నిర్వాసితులకు సాగు భూమి చూపించాల్సిన బాధ్యత అధికారులదే. ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్, వరద వేర్వేరు. ఎఫ్ఆర్ఎల్ ప్రాతిపదికన 371 ఆవాసాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాం. అదనంగా ఏ గ్రామాన్నీ చేర్చడానికి వీలు లేదు. ఇంటి పట్టాల్లో పేర్కొనే కండీషన్లపై స్పష్టత కోసం ప్రభుత్వానికి రాశాం. ఆవాసాల్లో సౌకర్యాలకు సంబంధించి పంచాయతీ డీనోటిఫై, నోటిఫైలపై కూడా ప్రభుత్వానికి రాశాం. పునరావాస కాలనీల్లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం. నాణ్యత లేకుండా ఇళ్లను నిర్మించిన కాంట్రాక్టర్లపై చర్యలకు ఆదేశించాం. శ్మశానాల కోసం 30-40 ఎకరాలను గుర్తించాం. ఇంకా ఓనర్లకు పేమెంట్ చేయలేదు. మ్యూటేషన్ అయిన వ్యవసాయ భూములకు సచివాలయంలో దరఖాస్తులు చేసుకుని పట్టాదార్ ప్యాస్‌బుక్స్ పొందవచ్చు. అర్హత ఉండి ఆర్ అండ్ ఆర్ అందని నిర్వాసితులు నన్ను నేరుగా కలవొచ్చు...

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కనగానపల్లి (శ్రీ సత్యసాయిజిల్లా)



సూర్యనారాయణ (ఫైల్ ఫొటో)

అప్పుల బాధతాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... చంద్రచర్ల గ్రామానికి చెందిన రైతు కత్తె సూర్యనారాయణ (65)కు పది ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పంటల సాగు నిమిత్తం బోర్లు వేశారు. బోరు నీరు, వర్షాధారంగా వేరుశనగ, కంది, కూరగాయల పంటలను సాగు చేసేవారు. పెట్టుబడి కోసం దాదాపు రూ.6 లక్షల వరకు అప్పులు చేశారు. గత నాలుగేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో పంట చేతికందలేదు. దీంతో చేసిన అప్పులుతీర్చడం కష్టమైంది. అప్పులు తీర్చలేనన్న మనోవేదనతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సూర్యనారాయణకు భార్య చిన్నగంగమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రౌండ్లు పూర్తి చేసుకున్న చంద్రయాన్-3

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

ఈ నెల 14న ఇస్రో ప్రయోగించిన చంద్రయాన్ - 3 భూమి చుట్టూ తిరిగే ప్రక్రియలో భాగంగా మూడు రౌండ్లు పూర్తి చేసుకుందని ఇస్రో అధికారులు తెలిపారు. భారత కాలమానం ప్రకారం గురువారం ఉదయం ఆరు గంటల 45 నిమిషాలకు నాల్గవ రౌండును ప్రారంభించిందన్నారు. చంద్రయాన్-3 ముందుగా భూమి చుట్టూ ఐదు రౌండ్లు తిరిగిన తరువాత తన ప్రయాణాన్ని చంద్రుని వైపుకు మళ్ళిస్తుందని, చివరి రౌండును ఈ నెల 25 మధ్యాహ్నం రెండు గంటల నుంచి మూడు గంటల మధ్యలో మొదలు పెడుతుందని అన్నారు. ఆగస్టు ఒకటికి చంద్రయాన్ -3 చంద్రునికి దగ్గరగా చేరుకునే అవకాశం ఉందని తెలిపారు. అంతర్జాతీయ చంద్రుడి దినోత్సవాన్ని ఇస్రోలో ఘనంగా నిర్వహించారు. 1969, జులై 20న నీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ మొదటిసారి చంద్రునిపై అడుగుపెట్టిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా జులై 20న అంతర్జాతీయ చంద్రుడి దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ.

గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు డిఎస్‌పి బి జనార్ధనరావు తెలిపారు. తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అంగలకుదురు గ్రామంలో గంజాయి సేవిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

విద్య ప్రతి విద్యార్థి హక్కు

- ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ
- ముగిసిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ

ప్రజాశక్తి - భీమవరం రూరల్ (పశ్చిమగోదావరి)

విద్య అనేది ప్రతి విద్యార్థికీ జన్మహక్కుగా ఉండాలని ఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులు నితీష్ నారాయణ అన్నారు. అయితే, నేడు దేశంలో అటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో విద్యారంగ అభివృద్ధిని కాంక్షిస్తూ విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 11న నరసాపురంలో ఎస్ఎఫ్ఐ ప్రారంభించిన విద్యార్థి సంగ్రామ సైకిల్‌యాత్ర గురువారం భీమవరంలో ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పి.వాసు అధ్యక్షతన లాంచీలరేవు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో నితీష్ నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ 77ను తీసుకొచ్చి పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్యను దూరం చేసిందన్నారు. 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తాము అధికారంలోకి రాగానే మెగా డిఎస్‌సి నిర్వహించి భర్తీ చేపడతామని ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి విస్మరించారని తెలిపారు. పాఠశాలలు ఏర్పాటు చేయాల్సిన ప్రభుత్వం జిఒ 117 ద్వారా మూసివేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, జిఒ 77 రద్దు చేయాలని, పీజీ విద్యార్థులకు విద్యా దీవెన అమలు చేయాలని డిమాండ్ చేశారు. సభలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాన్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కోసం ఆందోళనలు

ప్రభుత్వానికి నోటీసు అందించిన విద్యుత్ ఉద్యోగుల జెఎసి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళనలు నిర్వహిస్తున్నామని ఎపి విద్యుత్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు అందించింది. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్‌ను జెఎసి నాయకులు గురువారం కలిసి నోటీసు అందజేశారు. ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు పిఆర్‌సి అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు సవరించిన వేతనాలను నేరుగా యాజమాన్యమే చెల్లించాలని కోరారు. జెఎల్ఎం గ్రేడ్-2 సర్వీస్ ఉద్యోగులతోపాటు కారుణ్య నియామకాల ద్వారా చేరిన వారిని రెగ్యులర్ చేయాలన్నారు. విద్యుత్ సంస్థల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులనూ భర్తీ చేయాలని అన్నారు. ఈ డిమాండ్ల కోసం ఈ నెల 27 నుంచి ఆందోళనలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 27, 28 తేదీల్లో బ్యాడ్జిలతో భోజన విరామ సమయంలో నిరసనలు, 31న స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు వినతి పత్రాలు అందజేయడం, ఆగస్టు 1న రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహణ, ఆగస్టు 2, 3 తేదీల్లో రిలే దీక్షలు, 4, 5, 7 తేదీల్లో పనివేళల్లోనే పనిచేయాలని, 8న విద్యుత్ సౌధలో మహాధర్నా చేపట్టాలని, 9నయాజమాన్యం ఇచ్చిన సిమ్‌కార్డులను తిరిగి ఇస్తామని వివరించారు. ఆగస్టు 10 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు.



విజయవాడలోని ఆలయ సిల్క్స్ వద్ద ధర్నా చేస్తున్న ధర్మవరం వ్యాపారులు, చేనేత కార్మిక సంఘాలనేతలు

వస్త్ర వ్యాపారులపై దాడి హేయం

- నిందితులను కఠినంగా శిక్షించాలి
- విజయవాడలో ధర్మవరం వ్యాపారుల ధర్నా

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారులపై దాడిని ఖండిస్తూ విజయవాడలోని ఆలయ సిల్క్స్ షాపు ఎదుట ధర్మవరానికి చెందిన వస్త్ర వ్యాపారులు గురువారం ధర్నా చేశారు. ధర్మవరం పట్టుచీరల తయారీ, వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ, చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ బకాయి సొమ్ము అడగటానికి వచ్చిన చీరల వ్యాపారులను చిత్రహింసలకు గురిచేసిన ఆలయ సిల్క్స్ యజమాని అవినాష్ గుప్తా, మరో పది మందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులతోపాటు మిగిలిన వ్యాపారులకు కూడా రావాల్సిన డబ్బులు ఇప్పించాలని కోరారు. భవిష్యత్తులో చేనేతవర్గాలపై ఇటువంటి అమానుష దాడులు జరగకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్నాలో బాధిత వ్యాపారులు గిరిరాజు శశి, కోటం ఆనంద్, చేనేత ఐక్య కార్యచరణ కమిటీ కన్వీనర్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది వైకే, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు బండారు అనంత ప్రసాద్, తెలుగు నాడు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, చేనేత సంఘాల సమన్వయ కమిటీ కో కన్వీనర్ పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేనేత కాంగ్రెస్, ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కూరపాటి కోటేశ్వరరావు, తెలుగునాడు చేనేత కార్మిక సంఘం నాయకుడు కారంపూడి అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే..

విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తాం : చంద్రబాబు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. నాలుగేళ్లలో రూ.57 వేలకోట్ల విద్యుత్ ఛార్జీలు పెరిగాయని తెలిపారు. ఛార్జీలు పెంచి ఒక్కో కుటుంబంపై నాలుగేళ్లలో సరాసరి రూ.40 వేలు భారం మోపారని పేర్కొన్నారు. భవిష్యత్తులో కరెంటు ఛార్జీలు పెంచబోమని చెప్పిన ఏకైక పార్టీ టిడిపి అని అన్నారు. ఉంగుటూరుకు చెందిన వైసిపి నేతలు టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో చంద్రబాబు సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని ధరలు పెరిగాయని, ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి చినరాజప్ప, పితాని సత్యనారాయణ, మాజీ ఎంపి మాగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు హర్షించేలా ఫిట్‌మెంట్: యువగళం పాదయాత్రలో లోకేష్

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం)

ఉద్యోగులు హర్షించేలా ఫిట్‌మెంట్ ఇస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది లోపే వెలుగొండ పూర్తిచేసి తాగు, సాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. టిడ్కో లబ్ధిదారుల చేత గృహ ప్రవేశం చేయిస్తామన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర గురువారం కనిగిరిలో కొనసాగింది. నగరంలోని బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

సంపాదకీయం

దాగుడుమూతలు

ఏకరూప పౌర స్మృతి (యుసిసి) ప్రస్తుత పరిస్థితుల్లో అవసరం లేదు, వాంఛనీయమూ కాదని సాక్షాత్తూ 21వ లా కమిషన్ స్పష్టం చేసినా, ప్రజల మధ్య విద్వేష సృష్టికి మోడీ సర్కారు దాన్ని మళ్లీ ముందుకు తెస్తుంటే నిర్ద్వంద్వంగా తిరస్కరించాల్సింది పోయి 'అందులో ఏమున్నాయో తెలియద'ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, 'సూచనలను అధ్యయనం చేస్తామ'ని ప్రధాన ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించడం ప్రజా వంచనగా భావించాల్సి వుంటుంది. యుసిసి బిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో పలువురు ముస్లిం మత పెద్దలు బుధవారంనాడు వారిరువురిని వేర్వేరుగా కలిసిన సందర్భంలో ఈ విధంగా స్పందించడం ఆశ్చర్యం కలిగించింది. యుసిసిపై భయాందోళనలకు గురికావద్దని, ముస్లిముల మనసు నొప్పించేలా తమ ప్రభుత్వం ఎప్పుడూ వ్యవహరించదంటూనే ముసాయిదాలో ఏమున్నాయో తెలియదని, మీడియాలో వచ్చిన అంశాల ఆధారంగా మనోభావాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పడం యుసిసిపై చర్చను ఆటంకపర్చడమే అవుతుంది. ఒక రాష్ట్రానికి పాలకుడిగా తాను ఉన్నానని, ఇదే విషయంలో మీరైతే ఏమిచేస్తారో చెప్పాలని వారిని ఎదురు ప్రశ్నించడం మత పెద్దలను ఇబ్బంది పెట్టడమే కదా! అవసరం లేదు, వాంఛనీయం కాదన్న యుసిసిని తిప్పికొట్టడం మాని ఇంకా అధ్యయనం చేస్తామని టిడిపి చెప్పడం కేంద్ర ప్రభుత్వానికి ఊతం ఇవ్వడంగానే భావించాలి. మొత్తంగా చూస్తే ప్రత్యేక హోదా, విభజన హామీలను తిరస్కరించి, విశాఖ ఉక్కును అమ్మి తీరుతామంటున్న మోడీ సర్కారుకు అన్ని విధాలా మద్దతునందిస్తున్న ఈ రెండు పార్టీలూ యుసిసి విషయంలోనూ అదే వైఖరిని కొనసాగిస్తున్నాయని బోధపడుతోంది.

ఈ రెండు భేటీల సందర్భంగానూ సిఎంఓ, టిడిపి కేంద్ర కార్యాలయం ప్రకటనలు విడుదల చేశాయి తప్ప అక్కడికి మీడియాను అనుమతించలేదు. కానీ సిఎంను కలిసి వచ్చాక పెద్దలు ముస్లింలకు నష్టం జరిగేట్టయితే తాము యుసిసిని వ్యతిరేకిస్తామని ముఖ్యమంత్రి అన్నారని మీడియాతో చెప్పారు. సిఎంఓ ప్రకటనలో ఆ ఊసే లేదు. పర్సనల్ లా బోర్డులే తేల్చాలి అన్నది వైసిపి కచ్చితమైన వైఖరి అయితే, యుసిసి బిల్లు అవసరం లేదని కరాఖండిగా చెప్పివుండాల్సింది. కానీ ఆ పని చేయలేదు. అయితే, ఈ సమయంలో ముఖ్యమంత్రి ముస్లింల సంక్షేమానికి తమ ప్రభుత్వం చేపట్టిన చర్యలను వివరిస్తూనే వచ్చిన నాయకుల్లో కొంతమందికి, ఆయా కుటుంబాలకూ పదవుల భరోసానివ్వడం చర్చనీయాంశం అయ్యింది. అలాగే మత స్వేచ్ఛకు అడ్డుపడే ఈ చట్టానికి మద్దతు ఇవ్వొద్దని మత పెద్దలు చంద్రబాబును కోరితే దానిపై స్పష్టంగా చెప్పకుండా తమది లౌకిక పార్టీ అని, మత సామరస్యానికి ప్రాధాన్యత ఇచ్చిందని, తమ ఏలుబడిలో ముస్లింలకు చేసిన మేళ్ల గురించి వివరించి వారిని బుజ్జగించడానికి యత్నించడం మభ్యపుచ్చడమే కదా!

ఎన్ఆర్‌సి, సిఎఎ విషయంలో ఈ రెండు పార్టీలు బిజెపికి మద్దతునిచ్చాయి. గో రక్షణ పేరిట పేరిట బిల్లు తెచ్చి గోగూండాల స్వైర విహారానికి తెర లేపిన బిజెపి కేంద్ర ప్రభుత్వాన్ని బలపర్చాయి. పలు రాష్ట్రాల్లో ఎంతోమందిపై మూక దాడి చేసి చంపినా, నాలుగు చక్రాల వాహనంలో బంధించి తగులబెట్టినా ఈ పార్టీలు పల్లెత్తు మాటాడలేదు. దేశ సమైక్యతను దృష్టిలో ఉంచుకొని రాజ్యాంగం కల్పించిన 370 అధికరణాన్ని ఒక్క ఉదుటన రద్దు చేసి రాష్ట్రంగా ఉన్న జమ్ము కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతాలుగా చీల్చినా కిమ్మనని పార్టీలివి. ఏళ్ల తరబడి కాశ్మీర్‌ను ఓ జైలుగా మార్చినా ఆ పార్టీల ఎంపీలు ఏనాడూ కేంద్రాన్ని ప్రశ్నించలేదు. ఈనాడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న యుసిసి విషయంలో దాదాపు అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీలూ తమ వైఖరులను వెల్లడిస్తున్నా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన పార్టీలు దాగుడుమూతలాడడం తగదు. గత లా కమిషన్ అవసరం లేదని చెప్పిన యుసిసి ని తాము కూడా అక్కరలేదని చెబుతారా లేక ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించడానికి బిజెపి చేస్తున్న విచ్ఛిన్నకర కుట్రకు తోడ్పడతారా తేల్చి చెప్పాలి. రాజకీయ పార్టీగా ఇలాంటి కీలక అంశాల్లో ఏదో ఒకవైపున ఉండాలేతప్ప గోడ మీద పిల్లిలా వుంటే కుదరదు. ఆ పార్టీలు తమంతట తాము ప్రకటించేట్టు కనబడడంలేదు కనుక వారు బిజెపి తో ఉంటారా ప్రజల పక్షాన నిలుస్తారా అని జనం ఒత్తిడి చేయాలి. ప్రజాస్వామ్యంలో అదే మార్గం!

మంచి మాట



ప్రశ్నించడం మానేస్తే బానిసత్వానికి అలవాటు పడుతున్నట్లే.
- డా॥ బి.ఆర్.అంబేద్కర్,
భారత రాజ్యాంగ నిర్మాత.



చిన్న బడిని బతికించుకుందాం...

విశ్లేషణ





ఎన్. వెంకటేశ్వర్లు

అ అంటే అమ్మ, ఆ అంటే ఆవు, ఇ అంటే ఇల్లు, ఈ అంటే ఈగ, ఒక్క రెండు రెండు, రెండు రెండ్లు నాలుగు... వారాల పేర్లు.. నెలల పేర్లు, శ్లోకాలు, పెద్దలను గౌరవించడంతో పాటుగా ఏ పండగైనా అందరం కలిసి చేసుకోవాలని నేర్పిన మన ఊరి చిన్న బడి మాయమైపోతోందంటే కడుపు తరుక్కుపోతుంది. నేటి టీచర్లు, రాజకీయ నాయకులు, అధికారులు అందరూ దాదాపుగా ఆ చిన్న బడిలో చదువుకున్న వారే. మరి నేటి పిల్లలకి ఆ చిన్న బడి కమ్మదనాన్ని అందించాల్సింది ఎవరు?

2021 ఏప్రిల్ గణాంకాల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 33,813. ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు 1287. అన్ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలు 4040. మొత్తంగా 39,140 ప్రాథమిక పాఠశాలలు వున్నాయి. వీటిలో 26,50,910 మంది విద్యార్థులు అభ్యసించేవారు. ఇక ప్రభుత్వ, ఎయిడెడ్, మున్సిపల్, గిరిజన అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలలు కలిపి 61,137 పైగానే ఉన్నాయి. ప్రాథమిక తరగతులు బోధించే సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 71 వేల మంది వరకూ వున్నారు. వీరికి అదనంగా సుమారు 3 వేల మంది ఎయిడెడ్, ఎస్.జి.టి.లు వున్నారు. 56 తెలుగు అక్షరాలు నేర్పడానికి ఎన్నో పథకాలు, ఎన్నో స్కీమ్‌లు అమలు చేశాం. ఉపాధ్యాయులకు శిక్షణ మీద శిక్షణ ఇచ్చాం. ఏమైందో తెలిసేలోపు 26 అక్షరాల భాష వచ్చేసింది. ఇదే సర్వస్వం అయిపోయింది. దీని చుట్టూ పాలసీలు రూపొందించేశారు. జీవో-117 వచ్చేసింది. ప్రపంచ స్థాయి విద్యార్థిని తయారు చేయడం లక్ష్యంగా మారింది. పిల్లలకు సబ్జెక్ట్ ఉపాధ్యాయులతో బోధన, ఉపాధ్యాయులకు కోరుకున్న ప్రమోషన్లు...చకచకా హైస్కూల్‌కి ఒక కిలోమీటర్ లోపు ఉన్న చిన్న బడిలోని 3,4,5 తరగతుల పిల్లలు, మ్యాపింగ్ జరిగిపోయాయి. అక్కడక్కడ గత జ్ఞాపకాలు గుర్తుకొచ్చిన వారు కొందరు మా బడి, మా ఊరు లోనే ఉండాలన్నారు. చిన్నారులు సైతం మా చిన్న బడి కావాలని తల్లిదండ్రులను కదిలించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు, ప్రజా సంఘాల వారు కలిపి బస్సు యాత్ర చేశారు. అక్కడక్కడ కొన్ని చిన్న బడులను అపగలిగారు. ఈ కథ అక్కడితో ఆగిపోయింది. ఇప్పుడు చదువుకు కొత్త సంవత్సరం ప్రారంభమైంది. అసలు కథ మొదలైంది.

చిన్న బడి ప్రస్తుతం....

ఎలా ఉందో చూద్దామని వివిధ జిల్లాలలో పర్యటించాం. చిన్న బడిలో పిల్లలు చేరడం లేదని విని మనసు విలవిలలాడిపోయింది. గుంటూరు జిల్లా కేంద్రానికి దగ్గర ఉన్న వట్టిచెరుకూరు మండలంలో గత సంవత్సరం 1 నుంచి 5వ తరగతి వరకు 97 మంది వున్నారు. వారిలో 60 మంది 3,4,5 తరగతి పిల్లలను దగ్గర్లో ఉన్న ఉన్నత పాఠశాలకు తరలించారు. ఈ సంవత్సరం 1,2 తరగతుల పిల్లలు 26 మంది మాత్రమే ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో విలీనం కాకముందు 1 నుంచి 5 తరగతుల వరకు 98 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 3,4,5 తరగతుల నుండి 72 మందిని ఉన్నత పాఠశాలకు తరలించారు. ఒకటి, రెండు తరగతి పిల్లలు 26 మంది మిగిలారు. ఈ సంవత్సరం ఒకటి, రెండు తరగతి పిల్లలు కలిపి 16 మంది ఉన్నారు. కృష్ణా జిల్లా నందిగామ మండలంలో గతంలో ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు 56 మంది విద్యార్థులు ఉన్నారు. 3,4,5 తరగతుల 50 మంది విద్యార్థులను స్థానిక ఉన్నత పాఠశాలకు తరలించారు. ఇక్కడ ప్రస్తుతం ఆరుగురు విద్యార్థులు వున్నారు. నూతన అడ్మిషన్లు రెండు వచ్చాయి. కృష్ణా జిల్లా నందిగామ మండలంలోని మరొక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు వరకు మొత్తం 123 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 109 విద్యార్థులను స్థానిక ఉన్నత పాఠశాలకు పంపారు. ఇక 14 మంది మిగిలారు. ఈ సంవత్సరం నూతన అడ్మిషన్లు మూడు. బాపట్ల జిల్లా లోని ఓ మండలంలో ఒకటి నుంచి ఐదు వరకు 44 మంది విద్యార్థులు ఉండేవారు. వారిలో 3,4,5 తరగతుల విద్యార్థులు 34 మందిని తరలించారు. ప్రస్తుతం పదిమంది ఉన్నారు. కొత్త అడ్మిషన్లు రెండు మాత్రమే వచ్చాయి. కృష్ణా జిల్లా ఏ కొండూరు మండలంలో 1 నుంచి 5 తరగతులు విద్యార్థులు 136 మంది ఉండేవారు. వారిలో స్థానికంగా 3,4,5 తరగతులలోని 85 మందిని ఉన్నత పాఠశాలకు తరలించారు. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు 33 మంది ఉన్నారు. ఇక్కడ అడ్మిషన్లు 10 దాకా వచ్చాయి. నెల్లూరు జిల్లా ఒక మండలంలో ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 89 మంది విద్యార్థులు గతంలో ఉండేవారు. గతంలో 3,4,5 తరగతులకు చెందిన 64 మందిని తరలించారు. ప్రస్తుతం ఆ పాఠశాల విద్యార్థుల సంఖ్య 27. ఈ సంవత్సరం అడ్మిషన్లు 3. ఈ పరిస్థితి 1,2 తరగతుల పాఠశాలల వరకే అనుకుంటే పొరబాటే. 1-5 తరగతులున్న ప్రాథమిక పాఠశాలల్లో కూడా ఇదేవిధంగా ఎన్‌రోల్‌మెంట్ తగ్గిపోయింది. అలాగే అప్పర్ ప్రైమరీ పాఠశాలల్లోనూ ఎన్‌రోల్‌మెంట్ మందగించింది. కృష్ణా జిల్లాలో ఒక ఎం.పి.యు.పి. పాఠశాలలో 1-8 తరగతుల వరకు 129 రోల్ ఉంది. ఒకటో తరగతిలో ఏడు మాత్రమే న్యూ అడ్మిషన్లు. ఒక ప్రాథమిక పాఠశాలలో 1-5 తరగతుల వరకు 31 మంది పిల్లలున్నారు. ప్రస్తుతం ఐదు తరగతులు నడుస్తున్నాయి. ఇక్కడ ఒకటో తరగతి అడ్మిషన్లు రెండు మాత్రమే. మరొక ఎంపీయూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిది తరగతులు ఉన్నాయి. 104 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సంవత్సరం ఒకటవ తరగతి అడ్మిషన్లు 3. మొత్తంగా 7 అడ్మిషన్లు మాత్రమే అయ్యాయి. అలాగే 1-5 తరగతులున్న ఒక పాఠశాలలో 14 మంది వున్నారు. ఈ సంవత్సరం ఇక్కడ ఒక అడ్మిషన్ మాత్రమే అయ్యింది. ఇది భౌతికంగా కొన్ని జిల్లాల్లో చూసిన సమాచారం మాత్రమే. ఇంకా అన్ని జిల్లాలు, అన్ని పాఠశాలలను పూర్తి స్థాయి సర్వే చేస్తే ఇంతకంటే భిన్నంగా ఉండే అవకాశం ఏమీ లేదు.

అడ్మిషన్లు ఎందుకు తగ్గాయి?

పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నాము, 'నాడు-నేడు'తో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాము. కావాల్సిన జీవీకే కిట్లు ఇస్తున్నాము. పాఠశాల అద్భుతంగా ఉంది. ఇక నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులదే-అని ప్రభుత్వం చెప్తున్నది. ఎక్కువ ఎన్‌రోల్‌మెంట్‌తో సక్రమంగా నడుస్తున్న 1-5 తరగతుల వరకు ఉన్న చిన్న బడిని జీవో నెంబర్-117 పేరుతో...హైస్కూల్లో మ్యాపింగ్ ఎందుకు చేశారు? దానివల్లే కదా ఈ రోజు పాఠశాలల్లో అడ్మిషన్లు పూర్తి స్థాయిలో తగ్గిపోయాయి అంటే దానికి సమాధానం లేదు. ప్రాథమిక పాఠశాలల్లో 14,000 పైచిలుకు ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి. 98 లోపు ఎన్‌రోల్‌మెంట్ ఉన్న యూపీ పాఠశాలలో 2,400 దాకా ఉన్నాయి. 137 కంటే తక్కువ రోల్ ఉన్న ఉన్నత పాఠశాలలు 500 పైగా ఉన్నాయి. వీటన్నిటిలోనూ ఈ రోజు అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. తల్లిదండ్రుల దగ్గరికెళితే వాళ్ళు వాస్తవాలు చెప్తున్నారు. 'ఒక ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలకు మా పిల్లల్ని ఎలా పంపిస్తాం సార్? ముగ్గురు ఉపాధ్యాయుల ఉన్న దగ్గర కూడా ఒక ఉపాధ్యాయుడు ఎప్పుడూ ఏదో ఒక పనిలో బిజీగా ఉంటున్నారు. మా పిల్లలకు నాణ్యమైన విద్య ఎలా వస్తుంది?' అని అడుగుతున్నారు. సమాధానం ఎవరు చెప్పాలి. ఈ చిన్న బడి ఇలా మారిపోవటానికి కారణం ఎవరు?

> **1 నుంచి 5 తరగతుల ప్రభుత్వ పాఠశాల లేకుండా 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కడ నుంచి పెరుగుతుంది? అలాగే ఇప్పుడు మూడు నుంచి పది వరకు పాఠశాలల్లోకి పిల్లలు ఎక్కడ నుంచి చేరతారు? కింద స్థాయిలో ఒకటి, రెండు తరగతి పాఠశాలల్లో పిల్లలు తగ్గిపోతే, అక్కడ నుంచి వచ్చేవారే కదా మూడు నుంచి పది వరకు పాఠశాలల్లో చేరేది. అప్పుడు 3 నుంచి 10 వరకు పాఠశాల ఎలా బతుకుతుంది? పునాది వంటి చిన్న బడి బాగు గురించి ఆలోచించకుండా ప్రమోషన్ల మీద ప్రమోషన్లు, విలీనాల మీద విలీనాలు, రేషనలైజేషన్ మీద రేషనలైజేషన్లు జరుపుకుంటూ పోతే పిల్లల సంఖ్య ఎలా పెరుగుతుంది?**

కథ మొదటికే

జూన్ 12వ తేదీన బడులు మొదలయ్యాయి. జూన్ 12 నుండి 25 వరకు వేసవి ఎక్కువగా ఉందనే పేరుతో ఆఫ్ డే స్కూళ్లు పెట్టారు. 27 నుంచి పూర్తి రోజు పాఠశాల ప్రారంభం అనుకుంటే రెండు రోజుల పాటు ఐ.ఎఫ్.పి. ట్రైనింగ్ ఇచ్చారు. డిజిటల్ బోర్డులు ఇస్తామని, దానిలో పిల్లలకు చదువు చెప్పాలన్నారు. గతంలో ఇచ్చిన బైజూస్ టాబ్‌లను ఈ డిజిటల్ బోర్డుల్లోకి ఇన్‌స్టాల్ చేసి పాఠాలు బోధించాలి. రెండు రోజులపాటు స్కూల్ కాంప్లెక్స్‌లు. జీవీకే కిట్లు ఇచ్చారో లేదో మొత్తాన్ని అప్‌డేట్ చేయాలని ఒత్తిడి. ఇచ్చిన బూట్లు కొద్దిమంది పిల్లలకు సరిపోలేదు. సిబ్బందికి బదిలీలు, ప్రమోషన్ ఇచ్చారు. ఆ పోస్టులు ఒక చోటు నుంచి మరో చోటికి మార్చారు. క్యాడర్ స్ట్రెంత్ ఇంకా అప్‌డేట్ చేయలేదు. జీతాల సమస్య కొనసాగుతున్నది. ఇప్పుడు ఎన్ని ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయో, ఎంతమంది ఎస్‌జిటి ఉపాధ్యాయులు ఉన్నారో గణాంకాలు లేవు. ఏదేమైనా ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోతుంది. జీరో ఎన్‌రోల్‌మెంట్ పాఠశాలలు పెరుగుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీనపరుస్తున్నాయి. ఆలోచించాలి కదా. చదువు చెప్పటం తప్ప మరే ఇతరత్రా పనులు ఉండకూడదని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. పాఠశాలల్లో విద్యార్థికి నాణ్యమైన విద్య రావడం కోసం ఇంత ఒత్తిడి అవసరమా. ఇంత వర్క్ అవసరమా. తప్పకుండా ఆలోచించాలి. చర్చ జరగాలి. గతంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా చదువుకున్న ప్రస్తుత ఉపాధ్యాయులు, అధికారులు, రాజకీయ నాయకులు...చిన్న బడి చుట్టూ ఆలోచించాలి.

చిన్న బడి లేకుండా...

1 నుంచి 5 తరగతుల ప్రభుత్వ పాఠశాల లేకుండా 6 నుంచి 10 వరకు ఉన్న ఉన్నత పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ ఎక్కడ నుంచి పెరుగుతుంది? అలాగే ఇప్పుడు మూడు నుంచి పది వరకు పాఠశాలల్లోకి పిల్లలు ఎక్కడ నుంచి చేరతారు? కింది స్థాయిలో ఒకటి, రెండు తరగతి పాఠశాలల్లో పిల్లలు తగ్గిపోతే, అక్కడ నుంచి వచ్చేవారే కదా మూడు నుంచి పది వరకు పాఠశాలల్లో చేరేది. అప్పుడు 3 నుంచి 10 వరకు పాఠశాల ఎలా బతుకుతుంది? పునాది వంటి చిన్న బడి బాగు గురించి ఆలోచించకుండా ప్రమోషన్ల మీద ప్రమోషన్లు, విలీనాల మీద విలీనాలు, రేషనలైజేషన్ మీద రేషనలైజేషన్లు జరుపుకుంటూ పోతే పిల్లల సంఖ్య ఎలా పెరుగుతుంది? ప్రభుత్వ చిన్న బడిలో ఎన్‌రోల్‌మెంట్ తగ్గితే దాన్ని ప్రభావం 3-10 తరగతులున్న పాఠశాల మీద పడుతుందనే చిన్న లాజిక్‌ను ప్రభుత్వం ఎందుకు అశ్రద్ధ చేస్తుంది? ఎందుకు ఉపాధ్యాయులు ఈ చిన్న అంశాన్ని పట్టుకోలేదు. సమాజానికి అర్థం అయ్యేటట్టు ఎందుకు చెప్పలేకపోయాం. చిన్న బడి లేకుంటే భవిష్యత్తులో ప్రభుత్వ విద్యారంగానికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే సాధారణ సూత్రాన్ని ఇప్పటికైనా ప్రజానీకానికి అర్థం అయ్యేటట్లు చెప్పాలి. చిన్న బడి బతకకుండా ఉపాధ్యాయులు కూడా మనలేరనేది అర్థం చేసుకోవాలి. చిన్న బడిలో పిల్లల్ని చేర్చే బాధ్యత, ప్రభుత్వ బడి మీద భరోసానిచ్చే బాధ్యత ఉపాధ్యాయులుగా మనం తీసుకోవాలి. హక్కుల కోసం అవసరమైన సందర్భంలో పోరాటం చేస్తూనే, బాధ్యతల విషయంలో అవసరమైతే మరొక గంట, మరొక పీరియడ్, మరొక సెలవు రోజు పిల్లలతో గడపటానికి, పిల్లలకు చదువు మీద ఆసక్తి పెంచడానికి కృషి చేద్దాం. ఆ శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంది. ఇప్పటికే పాఠశాలల సమయంతో సంబంధం లేకుండా పిల్లలతో గడిపే మంచి ఉపాధ్యాయులు ఉన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుందాం. వారిని గౌరవిద్దాం. ఎన్ని ఇబ్బందులు అయినా, ఎన్ని ఆటంకాలు వచ్చినా, మన దగ్గరకు వచ్చే విద్యార్థులకు 4 అక్షరాలు నేర్పే ఒక కర్తవ్యాన్ని తీసుకుందాం. ప్రభుత్వ బడి మీద నమ్మకం కలిగిద్దాం. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం, మేధావులు, రాజకీయ నాయకులు అందరూ చిన్న బడి కోసం ఆ బడిని బతికించటం కోసం...ఏం చేయాలో మనమే ఒక ప్రణాళికను రూపొందిద్దాం. చిన్న బడిని బతికించుకుందాం.

/ వ్యాసకర్త యు.టి.ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు /

నివాళి


నాస్తికత్వం నిర్మాణాత్మక జీవన విధానమన్న గోరా

డా॥ దేవరాజు మహారాజు

దేవుడు అబద్ధం. మనిషిలో నీతి పెరగాలంటే అతని మనసులో దైవ భావన పోవాలి. ప్రజల మధ్య జాతి, మతం, కులం పేరుతో విషం పెరుగుతూ ఉంది. దానితో విద్వేషాలు పెరుగుతున్నాయి. దేవుడు, కర్మ, పునర్జన్మ లాంటి భావాలు పోతే మనిషి మతస్తుడిగా కాకుండా స్వచ్ఛమైన నీతిమంతుడైన మానవుడిగా మిగులుతాడు. ప్రజల మధ్య అడ్డుగోడలుండవు. అందరం ఒకటే అన్న భావనలోకి వచ్చినప్పుడు సోదరభావం దానంతట అదే వెల్లివిరుస్తుంది. ప్రేమ, ఆప్యాయత, ఒకరికి ఒకరం ఉన్నామన్న ధీమా పెరుగుతుంది!-అనేవి గోపరాజు రామచంద్రరావు (గోరా) ఆలోచనలు.

ఎవరీ గోరా? తెలుగు ప్రజలకు ఎందుకు ప్రియతముడయ్యాడూ? మూఢనమ్మకాల్లో మునిగిపోయి ఉన్న ఈ దైవ కేంద్ర సమాజాన్ని మానవ కేంద్ర సమాజంగా మార్చడానికి జీవితాంతం కృషి చేశాడు. వృక్షశాస్త్ర అధ్యాపకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధీజీ అనుచరుడు, జాతీయ స్థాయి కాంగ్రెస్ కార్యనిర్వాహకుడు. అస్పృశ్యతా నివారణకు, ఆర్థిక సమానత్వ సాధనకు కృషి చేస్తూనే-ప్రజల్లో కులమతతత్వ నిర్మూలనకు నడుం బిగించిన కార్యకర్త. సమిష్టి భోజనాలను నిర్వహిస్తూ జనాన్ని మతాంతర వివాహాల వైపు నడిపించిన కార్యశీలి. దేశంలో ఉన్నత విద్య సులభంగా అందుబాటులో లేని రోజుల్లో దాని కోసం తపించి, శ్రమించి స్నాతకోత్తర పట్టా సాధించిన వైజ్ఞానిక విద్యార్థి. ఉన్నత విద్యావంతుడై కూడా తన సుఖం తాను చూసుకోకుండా జనం కోసం జనం మధ్యలో తిరుగుతూ వారిలో వివేకాన్ని పెంచిన బాధ్యతగల పౌరుడు. గోరా నవ యువకుడిగా ఉన్నప్పటి నుండే - అంటే దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుండే, సామాజిక కార్యాచరణకు పూనుకున్నారు. అనతి కాలంలోనే ఆయన చేపట్టిన సానుకూల నాస్తికత్వ ప్రచారం అనేకమందిని ఆకర్షించింది. స్వచ్ఛందంగా అనేకమంది ముందుకొచ్చి ఆయన కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. క్రమంగా వాళ్ళే వాలంటీర్లయి ఆయనకు తోడు నిలిచారు.

ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా ఛత్రపురంలో గోరా 1902 నవంబర్ 15న జన్మించారు. వీరి తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, వెంకట సుబ్బారావు. పుట్టింది ఉన్నత వర్గంలోనైనా ఆయన దానికి ఎన్నడూ విలువ ఇవ్వలేదు. పైగా కుల మతాల అడ్డుగోడలు తొలగించడానికే ఉద్యమించారు. పర్లాకిమిడిలో ప్రాథమిక విద్య, పిఠాపురం రాజా కళాశాలలో ఇంటర్మీడి యట్ చదువు పూర్తి చేసి, మద్రాసు (తమిళనాడు) ప్రెసిడెన్సీ కళాశాలలో డిగ్రీ, మాస్టర్ డిగ్రీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే విజయనగరానికి చెందిన సరస్వతిని పెళ్లి చేసుకు న్నారు. అప్పుడామె వయస్సు పదేళ్ళు మాత్రమే. గోరా అనేక చోట్ల అనేక ఉద్యోగాలు చేశారు. మధురలోని మిషన్ కళాశాలలో తొలుత అధ్యాపకుడయ్యారు. ఆ తరువాత కోయంబత్తూర్ వ్యవసాయ కళాశాలలో పత్తి పరిశోధక సహాయకుడిగా పనిచేశారు.



జులై 26 గోరా వర్ధంతి

కొంతకాలం శ్రీలంక వెళ్లి కొలంబో లోని ఒక కళాశాలలో జీవశాస్త్ర అధ్యాపకుడయ్యారు. తిరిగి వచ్చి మళ్ళీ కాకినాడ కళాశాలలో అధ్యాపకుడిగా చేరారు. స్వతంత్ర భావాలు గల గోరా ఎక్కడా ఏ ఉద్యోగంలోనూ ఎక్కువ కాలం స్థిరంగా ఉండలేకపోయేవారు. నాస్తికుడిగా మారుతున్న దశలో ఆయన-ఇంట్లో ఉండే సంప్రదాయాలు, ఆచారాలతో రాజీ పడేవాడు కాదు. తను నడిచే మార్గం సంప్రదాయ వాదులైన తన తల్లిదండ్రులకు ఇష్టం లేదని గ్రహించుకుని, భార్య పిల్లలతో ఇల్లు వదిలి బయటికి వచ్చేశాడు. స్వతంత్ర జీవనం ప్రారంభించాడు. సమాజంలో మార్పు తేవడానికి ఏదో ఒక కేంద్రం ప్రారంభించాలని గోరా అనుకున్నారు. ఆ ఆలోచనను ఆయన భార్య సరస్వతీ గోరా బలపరిచారు. సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించడానికి కులమతాలకు అతీతంగా మానవవాద మూలాలపై నడిచే ఒక జీవన శైలిని రూపొందించడానికి 1940లో కృష్ణా జిల్లా ముదునూరులో 'నాస్తిక కేంద్రం' ఏర్పాటు చేశారు. గాంధీజీ కోరిక మేరకు 1944లో అఖిల భారత కాంగ్రెస్ ఆర్గనైజర్‌గా అలహాబాదు, ఢిల్లీలలో పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధునిగా పనిచేస్తూనే సామాజిక, ఆర్థిక సమానత్వానికి, వయోజన విద్యా వ్యాప్తికి, కులమతాల నిర్మూలనకు, అస్పృశ్యతా నిర్మూలనకు, దళితుల ఆలయ ప్రవేశానికి, కులాంతర-మతాంతర వివాహాలు జరిపించడానికి నిరంతరం కృషి చేశారు-గోరా. నాస్తిక కేంద్రం ముదునూరు నుండి పనిచేస్తున్నప్పుడే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. కేంద్రం కార్యకలాపాలను మరింత విస్తృతపరచడానికి దాన్ని విజయవాడకు మార్చారు. ప్రపంచ హేతువాద, నాస్తికోద్యమాలకు గోరా స్థాపించిన ఆ నాస్తిక కేంద్రమే కేంద్ర బిందువయ్యింది. 1972లో తొలి ప్రపంచ నాస్తిక మహాసభలు విజయవాడలో నిర్వహించిన ఘనత గోరా గారిదే! అప్పుడాయన వయసు 70 సంవత్సరాలు.

భారత గ్రామీణ సమాజంలో ఎలా మార్పులు తేవాలి? అనే అంశంపై ఉపన్యసిస్తూనే 1975 జులై 26న గోరా తుది శ్వాస విడిచారు. 2002లో గోరా శత జయంతి సందర్భంగా భారత ప్రభుత్వం తపాలా బిళ్ళ విడుదల చేసింది. గోరా మరణానంతరం ఆయన శ్రీమతి సరస్వతీ గోరా - నేతృత్వంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. 1980లో రెండవ ప్రపంచ నాస్తిక మహాసభలు కూడా విజయవాడ కేంద్రం ఆధ్వర్యంలోనే నిర్వహించారు. 2006లో సరస్వతీ గోరా మరణం తర్వాత 2020లో నాస్తిక కేంద్రం ఎనభై సంవత్సరాల మహోత్సవాలు జరుపుకుంది.

ఊరికే ఉపన్యాసాలివ్వడం కాకుండా, గోరా కార్యాచరణ లోకి దిగి చూపించారు. గ్రహణ సమయంలో గర్భిణులు బయట తిరిగితే 'గ్రహణం మొర్రి' రాదని, తన భార్య గర్భిణిగా ఉన్నప్పుడు తప్పనిసరిగా బయట తిప్పేవారు. ఆ దంపతులకు తొమ్మిది మంది పిల్లలు పుట్టినా ఎవరికీ గ్రహణం మొర్రి రాలేదు. జనం ఆ విషయం గుర్తుపెట్టుకోవాలి! రాహు-కేతువులు ఎక్కడో లేరు సమాజంలోనే ఉన్నారు. వారిని జనం అదుపు చేస్తూ ఉండాలని సరస్వతి గోరా తరచూ చెపుతూ ఉండేవారు. గోరా దంపతులు తమ పిల్లలకు పెట్టిన పేర్లు ప్రత్యేకంగా ఉన్నాయి. ఉప్పు సత్యాగ్రహం సమయంలో పుట్టిన కొడుక్కి 'లవణం' అని, భారతీయులు చట్ట సభల్లో గెలిచినప్పుడు పుట్టిన కొడుక్కి 'విజయం' అని, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో పుట్టిన కొడుకులకు సమరం, నియంత-అనీ తమ తొమ్మిదో సంతానానికి 'నవ్' (నౌ.9) అని, గాంధీ-ఇర్విన్ ఒడంబడిక జరిగిన సందర్భంలో పుట్టిన కూతురికి 'మైత్రి' అని, మరో అమ్మాయికి మనోరమ అనీ పేర్లు పెట్టారు. దేవుళ్ళ పేర్లు పెట్టుకునే జాడ్యం నుండి తెలుగువారిని కాపాడాలన్న ఉద్దేశంతో తమ సంతానానికి ఇలా ప్రత్యేకమైన పేర్లు పెట్టి చూపించారు. వీరి ప్రభావంతో చాలా మంది దంపతులు వారికి పుట్టిన పిల్లలకు దేవుడి పేర్లు పెట్టుకోవడం మానేశారు. అందుకే చూడండి...ఆధునికుల పేర్లు మానవ్, కౌశల్, వాత్సల్య, ప్రేమ, కారుణ్య లాంటివి కనిపిస్తున్నాయి.

సరస్వతి గోరా పూర్తిగా భర్తను అనుసరించి సంఘ సేవికగా మారారు. చిన్న వయసులోనే వివాహమైనా, అనతి కాలంలోనే ఆమె గోరా ఆలోచనల్ని అందుకుని ముందుకు నడిచారు. గోరా శ్రీలంకలో ఉద్యోగం చేస్తున్నప్పుడు ఈమె అక్కడ నిప్పుల మీద నడిచి చూపించారు. అందులో దైవ మహిమలేవీ లేవని నిరూపించారు. అంతే కాదు, దేవదాసీ వ్యవస్థ నుంచి మహిళల్ని బయటికి లాగి, సరస్వతి గోరా వారికి వివాహాలు జరిపించారు. ఆమె క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నప్పుడు కొన్నేళ్ళు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. జీవితాంతం బొట్టు, కాటుక, మంగళసూత్రాలు వంటివి ధరించకుండా మనువాద నియమాల్ని తిరస్కరించారు. గోరా మరణించినప్పుడు కూడా మతానికి సంబంధించిన కార్యక్రమాలేవీ లేకుండా ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. దాంపత్య జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని ఆదర్శ ప్రాయంగా తీర్చిదిద్దుకున్నారు. ప్రేమ, ఆప్యాయత, నైతికత మాత్రమే మానవత్వ లక్షణాలని గోరా దంపతులు చాటి చెప్పారు.

నిరంతరం కార్యరంగంలో శ్రమిస్తూనే, ఉపన్యసిస్తూనే గోరా నాస్తికత్వం మీద పత్రికలు-పుస్తకాలు ప్రకటించారు. ఆయన రచించిన పదహారు పుస్తకాలలో సగం ఇంగ్లీషువి. యాన్ ఎథీస్ట్ విత్ గాంధీ, పాజిటివ్ ఎథీస్ట్, ది నీడ్ ఆఫ్ ఎథిజమ్ వంటివి చాలా ప్రాచుర్యం పొందాయి. నాస్తికత్వం, దేవుని పుట్టుపూర్వోత్తరాలు, నేను నాస్తికుణ్ణి, సృష్టి రహస్యం, ఆర్థిక సమానత్వం, నాస్తికత్వం-ప్రశ్నోత్తరాలు వంటివి కూడా బహుళ జనాదరణ పొందిన రచనలు. ప్రతి ఒక్కరూ గోరా రచనలు చదవాలి. చదివించాలి.

/వ్యాసకర్త: సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త/

కవిత్వం

లే .. లేలే ఇండియా

లే..ఇండియా..లేలే ఇండియా
దేశపు మానాన్ని ఉన్మాదపు వీధుల్లో ఊరేశాక
అమ్మతనాన్ని ఉన్మాదపు హేళనల్లో తగలేశాక
కళ్ళుండీ చూడని కబోది పాలన సాగుతున్నాక
ఇంకా మౌనమా? లేక ఇది చేతగానితనమా?

తలల్లో తుట్టెలు కట్టిన ఉన్మాదం ఊరేగుతున్నాక
అమ్మలను నగ్నంగా కొమ్మలకు వేలాడదీసి
దేశాన్ని 'పరువు హత్య' చేసి నడి వీధిలో పాతేక
పాలనుందనీ, పాలకులున్నారనీ నమ్ముతున్నావా?
ఆర్నెల్లుగా మండుతున్న మణిపూర్ ఉన్మాదాన్ని
ఆర్పని పాలనను ప్రజా పాలనే అంటావా?
ఉన్మాదంలో కరిగిపోయిన నికృష్టం అంటావా?
ఇంకా మౌనమా? లేక ఇది చేతగానితనమా?

లే .. ఇండియా లేలే .. ఇండియా
చెవుల్లో సీసం పోసుకున్న ఈ పాలకుల కపటత్వాన్ని
పార్లమెంట్ మైకుల్లో చాటినంతనే ఆగని ఉన్మాదాన్నీ
చితుల్లో తగలేసి..జాతీయ గీతం గానం చేస్తూ
అమ్మ భారతి 'పరువు రక్షణ' పోరాటానికీ
భరత జాతి వారసత్వమే మనదని చాటడానికీ
ప్రజాక్షేత్రంలో నిలబడి తలపడి సమాధానం అడగడానికీ
నిలేసి కడగడానికీ..దులపడానికీ ..ఇదే సమయం
ఇంకా మౌనంగా ఉందామా? తలెత్తుకు నిలుద్దామా?
లే .. ఇండియా లేలే .. ఇండియా.

- ఉన్నం వెంకటేశ్వర్లు

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

ఆటవిక చర్య !

- మణిపూర్ ఘటనపై మండిపడిన భారతావని
- సుమోటోగా స్వీకరించిన సుప్రీం, జాతీయ మహిళా కమిషన్
- వీడియో తొలగించండి : సామాజిక మాధ్యమాలకు కేంద్రం ఆదేశాలు



న్యూఢిల్లీ : మానవత్వాన్ని మంటగలిపేలా మణిపూర్‌లో చోటు చేసుకున్న అత్యంత ఆటవిక చర్యపై యావత్‌ దేశం మండిపడింది. రెండు నెలల తర్వాత వెలుగు చూసిన ఈ ఘోరఘటనపై వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, రాజకీయ పార్టీల నేతలు, మహిళా సంఘాలు, పలు రంగాల ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేకపోతే తామే రంగంలోకి దిగాల్సి వుంటుందని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌ హెచ్చరించారు. జాతీయ మహిళా కమిషన్‌ ఈ ఘటనను సుమోటోగా స్వీకరించింది. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్‌ షా మణిపూర్‌ ముఖ్యమంత్రితో గురువారం మాట్లాడారు. తక్షణమే ఈ విషయంలో చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. మణిపూర్‌ వీడియోను తొలగించాల్సిందిగా ట్విట్టర్‌ను, ఇతర సామాజిక మాధ్యమాలను కేంద్రం ఆదేశించింది. మణిపూర్‌పై ప్రధాని మోడీ పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్‌ చేశారు. కుకీ మహిళలపై లైంగిక దాడులు, వేధింపులకు పాల్పడిన వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల సంఘాలు డిమాండ్‌ చేశాయి. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరాయి.

మోడీ మౌనం, చేతగానితనమే కారణం : కాంగ్రెస్‌ మండిపాటు

మోడీ మౌనం, చేతకానితనం కారణంగానే మణిపూర్‌లో ఇలాంటి అరాచకాలు జరుగుతున్నాయని కాంగ్రెస్‌ అగ్రనేత రాహుల్‌ గాంధీ ట్విట్టర్‌లో మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని దుండగుల చేతిలో పెట్టిందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో మానవత్వం మరణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రాష్ట్రంలో జరుగుతున్న హింసపై మోడీ పార్లమెంటులో ప్రకటన చేయాలని, ఏం జరుగుతోందో జాతికి చెప్పాలని డిమాండ్‌ చేశారు. ప్రధాని మౌనాన్ని దేశం ఎన్నటికీ క్షమించదని అన్నారు. రాజ్యాంగ బాధ్యతలను మోడీ గాలికి వదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రధాని మౌనం వీడినందుకు సంతోషమని కాంగ్రెస్‌ నేత శశిథరూర్‌ వ్యాఖ్యానించారు.

అమానవీయం, ఆటవికం : మమత

పశ్చిమ బెంగాల్‌ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఆటవిక చర్యగా అభివర్ణించారు. దేశం యావత్తు ఒక తాటిపై నిలబడి ఇటువంటి అమానుషమైన ఘటనలను ఖండించాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆ సమయంలో బాధిత మహిళల మనోవేదన, బాధ మాటల్లో చెప్పలేనిదని అన్నారు.

కేంద్రానిదే బాధ్యత : కేజ్రీవాల్‌

మణిపూర్‌లో పరిస్థితులకు కేంద్రమే కారణమని, ఇటువంటి ఘటనలపై ప్రధాని మోడీ మౌనంగా వున్నారంటే ఆయన బలహీన నేత అని అర్థమవుతోందని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ విమర్శించారు.

రెండు మాసాలకు పైగా రాష్ట్రంలో హింస చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం ఎలాంటి చర్య తీసుకోకపోవడం అత్యంత సిగ్గుచేటైన విషయమని అన్నారు. ప్రధాని స్పందిస్తూ ఈ ఘటన పట్ల ఆగ్రహంతో వున్నానని చెప్పారు. ఈ కోపాన్ని వ్యక్తం చేయడానికి 77 రోజులు పట్టిందా అని ఆప్‌ ప్రశ్నించింది.

పలువురు ముఖ్యమంత్రుల విమర్శ

ఇదొక కించపరిచే చర్య అని మేఘాలయ ముఖ్యమంత్రి సి.సంగ్మా వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో పరిస్థితులు చేయి దాటిపోతున్నపుడు మౌనంగా వుండడం సమస్యకు పరిష్కారం కాదని మిజోరాం ముఖ్యమంత్రి జోరామ్‌తంగా అన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.

పంజాబ్‌ ముఖ్యమంత్రి భగవంత్‌ మాన్‌ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటువంటి సంఘటనలను మన సమాజం సహించలేదన్నారు.

దిగ్భ్రాంతి కలిగించే ఘటన అని జెడియు అధ్యక్షులు రాజీవ్‌ రంజన్‌ సింగ్‌ వ్యాఖ్యానించారు. ఇదొక దురదృష్టకరమైన సంఘటన అని మాజీ సిజెఐ రంజన్‌ గగోయ్‌ పేర్కొన్నారు.

యావత్‌ దేశం ఆందోళన చెందుతోంది : మాయావతి

రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితులు ఇంతలా దిగజారిపోయినా బిజెపి ఇంకా అటువంటి ముఖ్యమంత్రిని కాపాడేందుకు ప్రయత్నిస్తుందా? అని బిఎస్‌పి అధినేత మాయావతి ప్రశ్నించారు. దేశం యావత్తు ఈ ఘటనపై తీవ్రంగా ఆందోళన చెందుతోందని అన్నారు.

బిజెపి ఓటు రాజకీయాలే ఇవి : అఖిలేష్‌ యాదవ్‌

మణిపూర్‌లో పరిస్థితులకు బిజెపి ఓటు రాజకీయాలే కారణమని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్‌ యాదవ్‌ విమర్శించారు. మణిపూర్‌ వీడియోతో విపరీతమైన, అల్లకల్లోలమైన అంశాలు బయటపడ్డాయని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తి అన్నారు. పార్లమెంట్‌లో మణిపూర్‌ వీడియోపై చర్చ జరగాలని శివసేన ఎంపి ప్రియాంక చతుర్వేది డిమాండ్‌ చేశారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు ప్రాధాన్యతనివ్వాలని శరద్‌పవార్‌ కోరారు. అమానవీయమైన ఈ ఘటనను కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి స్మృతి ఇరానీ ఖండించారు. మణిపూర్‌ ముఖ్యమంత్రితో మాట్లాడారు.

మహిళలను అగౌరవపరచే వారిని కఠినంగా శిక్షించాలని స్వతంత్ర ఎంపి నవనీత్‌ రాణా డిమాండ్‌ చేశారు. దోషులను కఠినంగా శిక్షించాలని దేశంలోని మహిళలు, పార్లమెంటులోని మహిళలు ప్రధాని మోడీని కోరుతున్నట్లు తెలిపారు. మణిపూర్‌ ముఖ్యమంత్రి ఎన్‌ బిరేన్‌ సింగ్‌ తన పదవికి రాజీనామా చేయాలని ఎంఐఎం చీఫ్‌ అసదుద్దీన్‌ ఒవైసి డిమాండ్‌ చేశారు. దారుణ సంఘటనపై సిబిఐ చేత దర్యాప్తు చేయించాలన్నారు.

మోడీ ఇంతకాలం ఎందుకు మాట్లాడలేదు? : సీతారాం ఏచూరి

మణిపూర్‌ అల్లర్లపై ప్రధాని నరేంద్ర మోడీ పార్లమెంటులో సమాధానం చెప్పాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్‌ చేశారు. 'మణిపూర్‌ వివాదంపై స్పందించేందుకు మోడీకి 75 రోజులు పట్టింది. ఇంతకాలం ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారు? మణిపూర్‌ అంశాన్ని పార్లమెంట్‌లో చర్చకు ఎందుకు అనుమతించడం లేదు. ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు?' అని ఏచూరి ప్రశ్నించారు. 'మే 4న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన దశ్యాలు నిన్న విడుదలయ్యాయి. ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బీరేన్‌ సింగ్‌ ప్రభుత్వాన్ని మార్చాలి. బాలికలపై దాడి చేసిన నిందితులకు మరణశిక్ష విధించాలి. అది చట్టప్రకారమే అమలు చేయాలి.' అని డిమాండ్‌ చేశారు.

భారీ ప్రదర్శనలు

- మణిపూర్‌ భవన్‌ను ముట్టడించిన ఐద్వా

ఇంఫాల్‌/న్యూఢిల్లీ బ్యూరో :

మణిపూర్‌లో కుకీ మహిళలను వివస్త్రను చేసి సామూహిక అత్యాచారం చేయడాన్ని నిరసిస్తూ మహిళా సంఘాలు న్యూఢిల్లీలోని మణిపూర్‌ భవన్‌కు ర్యాలీ నిర్వహించాయి. గురువారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో సర్దార్‌ పటేల్‌ మార్గ్‌లోని మణిపూర్‌ భవన్‌కు చేరుకున్న కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. సిఎం బీరేన్‌ సింగ్‌ రాజీనామా చేయాలని ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే డిమాండ్‌ చేశారు. , మణిపూర్‌లో మహిళలకు భద్రత లేదని విమర్శించారు. ఐద్వా ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి మైమూనా మొల్లాతో పాటుగా ప్రగతిశీల మహిళా సంఘటన్‌, నార్త్‌-ఈస్ట్‌ ఫోరమ్‌ ఫర్‌ ఇంటర్నేషనల్‌ సాలిడారిటీ, సెంటర్‌ ఫర్‌ స్ట్రగుల్‌ ఉమెన్‌ వంటి సంస్థల నాయకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లోని చురాచంద్‌పూర్‌లో గురువారం భారీ ప్రదర్శన నిర్వహించారు. అమానుష చర్యకు పాల్పడిన కామాంధులపై తక్షణమే చర్య తీసుకోవాలని వారు డిమాండ్‌ చేశారు.

ఢిల్లీలో మహిళా కాంగ్రెస్‌, యువజన కాంగ్రెస్‌ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. మహిళా కాంగ్రెస్‌ తాత్కాలిక అధ్యక్షురాలు నెత్తా డి సౌజా నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు జంతర్‌మంతర్‌ వద్ద ప్రదర్శన జరిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యువజన కాంగ్రెస్‌ కార్యకర్తలు పార్లమెంట్‌ భవనం వైపు ప్రదర్శనగా వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్ట్‌ చేశారు.

పోలీసులే ఆ మూకలకు అప్పగించారు!

- అత్యాచారానికి పాల్పడ్డారు : బాధిత మహిళల వెల్లడి

గువహటి : మణిపూర్‌లో బుధవారం రాత్రి వెలుగు చూసిన ఒక వీడియోపై దేశవ్యాప్తంగా ఆగ్రహజ్వాలలు రగిలాయి. కొంతమంది అల్లరి మూక కుకీ తెగకు చెందిన 20, 40 ఏళ్ల వయసులో వున్న ఇద్దరు మహిళలను బి ఫైనమ్‌ గ్రామ సమీపంలో నగ్నంగా రోడ్డుపై నడిపించుకుంటూ సమీపంలోని పొలాల వద్దకు తీసుకెళ్లడం ఆ వీడియోలో కనిపిస్తోంది. మే 4న ఈ ఘటన జరగగా, మే 18న దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసులే తమను ఆ దుండగులకు అప్పగించారని మణిపూర్‌ బాధిత మహిళల్లో ఒకరు 'ఇండియన్‌ ఎక్స్‌ప్రెస్‌' కు ఫోన్‌లో తెలిపారు. "మా గ్రామంపై దాడి చేసిన అల్లరి మూకతోనే పోలీసులు కూడా వున్నారు. మమ్మల్ని ఇంటికి సమీపం నుంచి తీసుకెళ్లిన పోలీసులు కొంత దూరం వెళ్లిన తర్వాత రోడ్డుపై ఆ అల్లరి మూక దగ్గర వదిలేసి వెళ్లిపోయారు. పోలీసులే మమ్మల్ని వారికి అప్పగించారు." అని చెప్పారు.

తమిద్దరిలో చిన్నదైన మహిళపై పట్టపగలే దారుణంగా సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని మరో మహిళ తెలిపింది. పోలీసులు తమను పోలీసు స్టేషన్‌కు తీసుకువస్తుండగా, స్టేషన్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో అల్లరి మూక అటకాయించి మమ్మల్ని లాక్కెళ్తుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. యువ మహిళ తండ్రి, సోదరుడిని కూడా ఈ మూక చంపేసినట్లు ఆమె తెలిపారు. ఆ గ్రూపులో కొద్దిమందిని గుర్తు పట్టగలనని,వారిలో ఒకరు తన సోదరుడి స్నేహితుడిగా తెలుసునని చెప్పారు. ఆ ఘటనకు సంబంధించి వీడియో వుందన్న విషయం కూడా తమకు తెలియదని బాధిత మహిళ తెలిపారు.

ఎఫ్‌ఐఆర్‌ నమోదు, ఇద్దరు అరెస్టు

ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఘటన జరిగిన రెండు మాసాల తర్వాత ఎఫ్‌ఐఆర్‌ నమోదు చేశారు. ఇద్దరిని అరెస్టు చేశారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

ప్రకటనల కోసం రూ.3,064.42 కోట్లు

- ఐదేళ్లలో ఖర్చు చేసిన మోడీ సర్కార్‌

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఐదేళ్లలో ప్రచారం చేసుకోవడానికి మోడీ సర్కార్‌ రూ.3,064.42 కోట్ల ప్రజాధనాన్ని ప్రకటనల కోసం ఖర్చు చేసింది. గురువారం రాజ్యసభలో ఒక ఎంపి అడిగిన ప్రశ్నకు కేంద్ర సమాచార శాఖ మంత్రి అనురాగ్‌ సింగ్‌ ఠాకూర్‌ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. 2018-19 నుంచి 2023-24 (జూలై 13 వరకు) మోడీ సర్కార్‌ ప్రకటనల కోసం ప్రింట్‌ మీడియాకు రూ.1,338.56 కోట్లు, ఎలక్ట్రానిక్‌ మీడియాకు రూ.1,273.06 కోట్లు, హోర్డింగ్‌లు వంటి అవుట్‌ డోర్‌ ప్రకటనలకు రూ.452.8 కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు.

ఐదేళ్లలో ప్రధాని మోడీ విదేశీ పర్యటనల ఖర్చు రూ.254.87 కోట్లు

ప్రధాని మోడీ గత ఐదేళ్లలో విదేశీ పర్యటనలకు రూ.2,54,87,01,373 ఖర్చు చేసినట్లు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి. మురళీధరన్‌ తెలిపారు. 2019 ఆగస్టు నుంచి తొమ్మిది దేశాల్లో ప్రధాని పర్యటించారని చెప్పారు.

దేశంలో పెట్రోల్‌, డీజిల్‌ ధర లీటర్‌కు రూ.27 పెరుగుదల

దేశంలో పెట్రోల్‌, డీజిల్‌ ధర లీటర్‌కు రూ.27 పెరిగిందని కేంద్ర మంత్రి హర్దీప్‌ సింగ్‌ పూరి తెలిపారు. 2020 ఏప్రిల్‌లో లీటర్‌ పెట్రోల్‌ ధర రూ.69.59 ఉంటే, 2023 జూలై నాటికి రూ.96.72కు పెరిగిందని, అంటే రూ.27.13 పెరిగిందని తెలిపారు. డీజిల్‌ ధర రూ.62.29 నుంచి 89.62కి, అంటే రూ.27.33 పెరిగిందని చెప్పారు.

గ్యాస్‌ సబ్సిడీలో రూ.16,781 కోట్ల కోత

కేంద్ర ప్రభుత్వం గ్యాస్‌ సబ్సిడీలో రూ.16,781 కోట్లు కోత విధించినట్లు కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి రామేశ్వర్‌ తేలీ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వంలో 9,64,359 పోస్టుల ఖాళీ

కేంద్రం పరిధిలోని 79 మంత్రిత్వశాఖలు, విభాగాల్లో 2022 మార్చి 1 నాటికి 9,64,359 పోస్టుల ఖాళీగా ఉన్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ తెలిపారు.

మూడేళ్లలో రూ.1,09,859 కోట్ల టోల్‌ ఫీజు వసూలు

మూడేళ్లలో రూ.1,09,859.02 కోట్ల టోల్‌ ఫీజు వసూలు చేసినట్లు కేంద్ర మంత్రి నితిన్‌ గడ్కరీ లోక్‌సభలో ఒకప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో గత మూడేళ్లలో 19,687 చిన్న పరిశ్రమలు మూతపడ్డాయని కేంద్ర మంత్రి భానుప్రతాప్‌ సింగ్‌ వర్మ తెలిపారు. అందులో పనిచేసే 1,32,205 ఉద్యోగులు ఉపాధికి దూరం అయ్యారని తెలిపారు.

న్యాయమూర్తుల నియామకాల్లో రిజర్వేషన్లపై సవరించం

న్యాయమూర్తుల నియామకాల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు ప్రాతినిధ్యం కల్పించడానికి రాజ్యాంగాన్ని సవరించే ప్రతిపాదన ప్రస్తుతం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌ రామ్‌ మేఘ్వాల్‌ తెలిపారు.

ఓటరు కార్డుకు ఆధార్‌ లింగ్‌ తప్పని సరికాదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌ రామ్‌ మేఘ్వాల్‌ తెలిపారు. రాజ్యసభలో ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

సెతల్వాద పిటీషన్‌ తిరస్కరణ

అహ్మదాబాద్‌ : 2002 గోద్రా అల్లర్లకు సంబంధించి కల్పిత సాక్ష్యాలను సృష్టించారనే కేసు నుంచి తనను తప్పించాలని హక్కుల ఉద్యమకారిణి తీస్తా సెతల్వాద దాఖలు చేసిన పిటీషన్‌ను అహ్మదాబాద్‌లోని సెషన్స్‌ కోర్టు గురువారం తిరస్కరించింది. అదనపు సెషన్స్‌ జడ్జి ఎ ఆర్‌ పటేల్‌ ఈ పిటీషన్‌ను తిరస్కరించారు. ఈ పిటీషన్‌కు వ్యతిరేకంగా గుజరాత్‌ ప్రభుత్వం వాదనలు వినిపించింది.

దద్దరిల్లిన పార్లమెంట్‌

(మొదటి పేజీ తరువాయి)

ఆనవాయితీ ప్రకారం ప్రధాని మోడీ ప్రతిపక్ష నేతలను పలుకరించారు. అదేవిధంగా సోనియా గాంధీ వద్దకు వెళ్లి, ఆమె ఆరోగ్యం గురించి అడిగారు.కాంగ్రెస్‌ నేత అధిర్‌ రంజన్‌ చౌదరి మాట్లాడుతూ, మణిపూర్‌ పరిస్థితి గురించి సభలో చర్చించాలని నరేంద్ర మోడీని సోనియా గాంధీ కోరారని చెప్పారు. మరోవైపు రాజ్యసభలో ఇటీవల మరణించిన ఎంపి హరిద్వార్‌ దూబేకు నివాళు ర్పించిన తరువాత సభ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారంభమైన సభలో కాంగ్రెస్‌తో సహా అన్ని ప్రతిపక్ష పార్టీల సభ్యులు మణిపూర్‌ హింసపై చర్చించాలని డిమాండ్‌ చేశారు.

ప్రతిపక్షాలు భేటీ

పార్లమెంట్‌ ఉభసభలు ప్రారంభం కావడానికి ముందు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్ష పార్టీల నేతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 26 పార్టీల నేతలు పాల్గొన్నారు. పార్లమెంట్‌లో వ్యవహరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు.

రాజ్యసభ ప్యానెల్‌లో సగం మంది మహిళలే

రాజ్యసభ ఉపాధ్యక్షుల ప్యానెల్‌ను ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్‌ జగదీప్‌ ధన్‌కర్‌ ప్రకటించారు. ఈ జాబితాలో 50 శాతం మంది మహిళలు ఉన్నారు. మొత్తం ఎనిమిది మంది ఉపాధ్యక్షుల్లో నలుగురు మహిళలు ఉన్నారు. బిజెపి ఎంపిలు పిటి ఉష, ఎస్‌ ఫంగ్నోన్‌ కొన్యక్‌, ఎన్‌సిపి ఎంపి ఫౌజియా ఖాన్‌, బిజెడి ఎంపి ఎంపి సులత దేవి ఈ పదవులను పొందారు.

ఉధృతంగా గోదావరి, శబరి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంలోని ఉదయ భాస్కర్‌ కాలనీ, గిన్నెల బజార్‌ కాలనీలను ఖాళీ చేయించి కోతులగుట్టలోని పునరావాస కాలనీలకు ప్రజలను తరలించారు. ఇంకొంత మంది సురక్షిత ప్రాంతాలకు వెళ్లి అద్దె ఇళ్లను చూసుకుంటున్నారు. ముంపు మండలాలలో కలెక్టర్‌ సుమిత్‌ కుమార్‌ పర్యటించారు. ప్రస్తుతం లాంచీలను ఏర్పాటు చేశామని, వరద తీవ్రతను బట్టి మర పడవలు కూడా ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. మండలంలోని స్కూళ్లకు సెలవు ప్రకటించారు. చొక్కనపల్లి, శ్రీరామగిరి, ఒడ్డుగూడెం. ఒడ్డుగూడెం కాలనీ. ధర్మతాళ్లగూడెం ప్రాంతాల్లో సిపిఎం బృందాలు పర్యటించాయి.

ఏలూరు కలెక్టరేట్‌లో కంట్రోల్‌ రూమ్‌

వరద ఉధృతి నేపథ్యంలో ఏలూరు జిల్లా కలెక్టరేట్‌, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఆఫీస్‌, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం తహశీల్దార్‌ కార్యాలయంలో కంట్రోల్‌ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కాజ్‌వేపై వరద నీరు చేరి బెస్తగూడెం, గొమ్ముగూడెం, దాచారం, నెమలిపేట వంటి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగు పొంగడంతో కొయిదా, కట్కూరు, యడవల్లి, చిగురుమామిడి, కాచారం, కొత్తూరు వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలం గొమ్ముగూడెం గ్రామంలోని 253 కుటుంబాలను రావికుంట పునరావాస కాలనీల్లో ఏర్పాటు చేసిన శిబిరానికి అధికారులు తరలించారు. వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట గ్రామాన్ని జెసి లావణ్యవేణి సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో మరో రెండు అడుగుల మేర వరద పెరిగింది. దీంతో లంక గ్రామాలకు పడవ ప్రయాణాలు నిషేధించారు. కరుగోరుమిల్లి పుష్కర ఘాట్‌ పూర్తిగా నీట మునిగిపోయింది.

ఏమిటీ నిర్లక్ష్యం?

(మొదటి పేజీ తరువాయి)

తెలియజేశారు. బుధవారం వెలుగులోకి వచ్చిన మే4 నాటి ఆ దారుణ అకృత్యానికి సంబంధించిన విజువల్స్‌ తమను తీవ్రంగా కలచివేశాయని, అందుకే దీనిని సుమోటో కేసుగా తీసుకుంటున్నామని చీఫ్‌ జస్టిస్‌ ప్రభుత్వ తరపు న్యాయాధికారులకు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వంపై సీరియస్‌ అవుతూ, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో ఈ తీరు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. "హింసను రెచ్చగొట్టడానికి మత ఘర్షణల్లో మహిళలను ఒక పావుగా వాడుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇది మానవ హక్కులను దారుణంగా ఉల్లంఘించడమే" అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఘటన జరిగి ఇన్నాళ్ళయినా నేరస్తులపై తీసుకున్న చర్యలేంటని ఆయన ప్రశ్నించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ఏం చర్యలు తీసుకుందో చెప్పాలని కోరారు. ఇటువంటి ఘటన ఇదొక్కటేనా లేక ఇలాంటివి ఇంకా జరుగుతున్నాయో ఎవరికి తెలుసునని సిజెఐ వ్యాఖ్యానించారు. మణిపూర్‌ హింసకు సంబంధించి పలు కేసులు విచారిస్తున్నందున ఈ అంశాన్ని కూడా తమకు తామే పరిగణనలోకి తీసుకున్నామని చెప్పారు. జులై 28న దీనిపై విచారణ జరుపుతామని అన్నారు.న్యాయస్థానం ఆందోళనలను ప్రభుత్వానికి తెలియచేస్తామని అటార్నీ జనరల్‌ ఆర్‌.వెంకటరమణి, మణిపూర్‌ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న తుషార్‌ మెహతాలు కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ విషయంలో తక్షణ చర్యలు తమకు కావాలని న్యాయస్థానం, ప్రభుత్వాలకు స్పష్టం చేసింది.

కఠిన చర్యలు తప్పవు ముఖ్యమంత్రి బీరేన్‌ సింగ్‌

అత్యంత దారుణమైన ఘటనపై కూలంకషంగా దర్యాప్తు జరుగుతోందని మణిపూర్‌ ముఖ్యమంత్రి ఎన్‌.బీరేన్‌ సింగ్‌ తెలిపారు. అవసరమైతే దోషులకు ఉరి శిక్ష విధించడంతో సహా అన్ని కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



నీరు

ఆటల పాటల పిల్లల్లారా
భావి భారత పౌరుల్లారా
నీటి విలువ తెలుసుకోండి
జగతికి మూలం నీరేనండి

జీవరాశులు బతకాలన్నా
మనం బాగుండాలన్నా
నీటి వృథానాపండి
నీటిని పొదుపు చేయండి



అధిక శాతం సముద్రాలున్నా
వాగులు వంకలు నదులున్నా
తాగు నీరు దొరకడం లేదండి
ఉన్న నీటిని చూసుకు వాడండి

బావులు బోర్లు ఎన్నున్నా
వేసవిలో నీరు సున్నా సున్నా
ఇంకుడు గుంతలు తవ్వండి
వర్షపు నీరు భూమిన నింపండి


చెరువులు కాలువలెన్నున్నా
ఎండాకాలం ఎండునన్నా
నీటి తొట్టెలు పెట్టండి
పక్షుల, జంతువుల కాపాడండి

సమృద్ధి నీరు ఉన్నప్పటికీ
నీటి కొరతా లేనప్పటికీ
నీటిని కలుషితం చేయకండి
జీవుల ప్రాణం రక్షించండి

నీరు లేని జీవితమండీ
ఊహించడం కష్టమండీ
భూమిపై నీరు లేక పోతే
జంతుజాలమే ఉండదండీ !

- ఆవుల చక్రపాణి యాదవ్
99633 50973

అంకెలు కలపండి



పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన బొమ్మలో ఉన్న అంకెలను వరుసగా కలపండి..

నేను గీసిన బొమ్మ



**- బి. వైనవి,
8వ తరగతి,
కేంద్రీయ విద్యాలయం,
ఎస్‌విఎం-1,
విశాఖపట్నం.**



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఓటుకు నోటు కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'ఓటుకు నోటు' కేసు విచారణ ఆగస్టు 28కి వాయిదా పడింది. 'ఓటుకు నోటు కేసు అవినీతి నిరోధక చట్టం పరిధిలోకి రాదంటూ నిందితులుగా ఉన్న ఎంపి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్లను తెలంగాణ హైకోర్టు కొట్టేయడంతో వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదితో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది.

రాజ్యాంగ ధర్మాసనానికి ఢిల్లీ ఆర్డినెన్స్ కేసు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రభుత్వ అధికారుల నియామకాలు, బదిలీల విషయంలో కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన ఆర్డినెన్స్ రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ ఆప్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. కేసును రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేస్తున్నట్లు తెలిపింది. 370వ అధికరణ కేసు కన్నా ముందుగా ఈ పిటిషన్‌ను విచారించాలన్న అభ్యర్థనను తిరస్కరించింది.

ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్‌లపై

కేంద్రమే చర్య తీసుకోవచ్చు

- నిబంధనలను సవరించిన మోడీ సర్కారు

న్యూఢిల్లీ : ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్‌ఎస్, పెన్షనర్ల పదవీ విరమణ ప్రయోజనాలకు సంబంధించిన నిబంధనలను కేంద్రం సవరించింది. ఘోరమైన దుష్ప్రవర్తనకు పాల్పడినట్టు లేదా తీవ్రమైన నేరానికి పాల్పడినట్టు నిర్ధారించబడితే వారిపై చర్య తీసుకునేందుకు, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రిఫరెన్స్ లేకుండా కూడా వారి పెన్షన్‌ను నిలిపివేయడానికి లేదా ఉపసంహరించుకోవడానికి ఇది అధికారం కల్పిస్తుంది. ఆలిండియా సర్వీసెస్ (డెత్-కమ్-రిటైర్మెంట్ బెనిఫిట్స్) సవరణ నియమాలు, 2023పై జులై 6 నోటిఫికేషన్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డిఒపిటి) 'తీవ్రమైన దుష్ప్రవర్తన'లో పేర్కొన్న ఏదైనా పత్రం లేదా సమాచారాన్ని బహిర్గతం చేయడం అని పేర్కొన్నది. ఈ మేరకు ఆలిండియా సర్వీసెస్ (డెత్-కమ్-రిటైర్మెంట్ బెనిఫిట్స్) రూల్స్, 1958లో మార్పులు చేసింది.

పాత మిత్రులను మరచిపోలేం!

- కిసింజర్‌తో జిన్‌పింగ్ భేటీ



బీజింగ్ : చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అమెరికా మాజీ విదేశాంగ మంత్రి, దౌత్య రాయబారి హెన్రీ కిసింజర్‌ను గురువారం నాడిక్కడ కలుసుకున్నారు. కిసింజర్ ఇటీవలే వందో పుట్టిన రోజు జరుపుకున్నారని అంటూ ఇన్నేళ్లలో వంద సార్లకు పైగా ఆయన చైనాలో పర్యటించారని జిన్‌పింగ్ గుర్తు చేసుకున్నారు. ఈ రెండు వందలు కలిసి ఈ పర్యటనకు ఒక ప్రత్యేక ప్రాధాన్యతను కలిగించాయని వ్యాఖ్యానించారు. "52ఏళ్ల క్రితం చైనా నేతలు మావో జెడాంగ్, ప్రధాని చౌ ఎన్ లై, అమెరికా నేతలు రిచర్డ్‌నిక్సన్, డాక్టర్ కిసింజర్ తమదైన అసాధారణ వ్యూహాత్మక దార్శనికతతో ఇరు దేశాల మధ్య సహకారానికి సంబంధించి సరైన నిర్ణయం తీసుకున్నారని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య సాధారణ సంబంధాలు అప్పుడే పునరుద్ధరించబడ్డాయని ఆయన తెలిపారు. ఆనాటి నిర్ణయం ఇరు దేశాలకు ప్రయోజనాలు చేకూర్చిందని, ప్రపంచగతినే మార్చేసిందని అన్నారు. స్నేహ సంబంధాలకు చైనా ప్రజలు ఎప్పుడూ విలువ ఇస్తారన్నారు. "మా పాత మిత్రులను మేం ఎన్నటికీ మరిచిపోం, అలాగే ఇరు దేశాల మధ్య సంబంధాల వృద్ధికి కృషి చేసిన మీ విలువైన చారిత్రక సేవలను కూడా మరిచిపోలేం." అని జిన్‌పింగ్ పేర్కొన్నారు. శతాబ్ద కాలంలో ఎన్నడూ లేనంతగా ప్రపంచం చాలా వేగంగా మార్పు చెందుతోందని అన్నారు. అంతర్జాతీయంగా చాలా మార్పులు వస్తున్నాయన్నారు. చైనా, అమెరికాలు మళ్లీ క్రాస్ రోడ్‌లో నిలుచున్నాయన్నారు. ఈ తరుణంలో మళ్లీ ఇరు పక్షాలు మరో చారిత్రక నిర్ణయాన్ని తీసుకోవాల్సిన అవసరం వుందని అన్నారు.

త్రిపుర సిపిఎం ఎమ్మెల్యే శాంసూల్ హక్యూ ఆకస్మిక మృతి

అగర్తల : త్రిపుర సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, బాక్సానగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే శాంసూల్ హక్యూ గుండెపోటుతో బుధవారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. హక్యూ వయస్సు 68 ఏళ్లు. ఆయనకు భార్య. నలుగురు కుమారులు ఉన్నారు. హక్యూ కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో చికిత్స కోసం మంగళవారం రాజధాని అగర్తలకు తన కోడలితో కలిసి వచ్చారు. ఎమ్మెల్యే హాస్టల్‌లో ఉండగా బుధవారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. వెంటనే అగర్తల ప్రభుత్వ మెడికల్ కాలేజ్ (ఎజిఎంసి)కి తరలించగా, అప్పటికే హక్యూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు.

ఊమెన్ చాందీకి ఘనంగా తుది వీడ్కోలు

తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఊమెన్ చాందీ అంత్యక్రియలు గురువారం ఘనంగా కొట్టాయంలో జరిగాయి. బుధవారం తిరువనంతపురం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర 150 కిలోమీటర్లు సాగి, గురువారం తెల్లవారు జామున 5:30 గంటల సమయానికి ఊమెన్ చాందీ స్వస్థలం కొట్టాయం చేరుకుంది. తరువాత కొద్ది సేపు కొట్టాయం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) కార్యాలయం ముందు ముందు ఊమెన్ చాందీ భౌతిక కాయాన్ని ఉంచారు.

మహారాష్ట్రలో విరిగిపడిన కొండచరియలు

- 16 మంది మృతి

ముంబయి : భారీ వర్షాలు మహారాష్ట్రను ముంచెత్తుతున్నాయి. రాయగడ్ జిల్లా ఖాలాపూర్ తాలూకాలోని ఇర్షాల్‌వడీ గ్రామంలో బుధవారం రాత్రి కొండచరియలు విరిగిపడి 16 మంది ప్రాణాలు కోల్పోయారు. సహాయ సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి అనేక మందిని కాపాడారు. గాయపడిన వారిని నవీ ముంబయిలోని ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికీ అనేక కుటుంబాలు శిథిలాల కింద చిక్కుబడి ఉండడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోందిముంబయి, దాని పరిసర ప్రాంతాలలో భారీ వర్షాలు పడుతుండడంతో జన జీవనం స్తంభించింది. వందకు పైగా స్థానిక రైళ్లను రద్దు చేశారు. థానే, పాల్‌ఘర్, రాయ్‌గడ్‌లో విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

బ్రిజ్ భూషణ్‌కు బెయిల్ మంజూరు

న్యూఢిల్లీ: లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌కు ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసింది. అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ హర్జిత్ సింగ్ జస్పాల్ ఈ ఆదేశాలను జారీ చేశారు. బిజెపి ఎంపి, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ తమను లైంగికంగా వేధించినట్లు మహిళా రెజ్లర్లు ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో సాక్షులను ఆయన ప్రభావితం చేయరాదని, అనుమతి లేకుండా దేశాన్ని విడిచి వెళ్లరాదని, కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. బ్రిజ్ భూషణతో పాటు వినోద్ తోమర్‌కు కూడా రూ.25 వేల పూచీకత్తుపై కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో తరుపది విచారణ జూలై 28న ఉంటుందని కోర్టు తెలిపింది.

చీతాల మృతిపై వివరణివ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ: 'ప్రాజెక్ట్ చీతా'లో భాగంగా విదేశాల నుంచి తీసుకొచ్చిన చీతాలు ఒక్కొక్కటిగా మరణిస్తుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీనిపై వివరణ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను తీసుకొచ్చారు. వాటిని మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్క్‌లో విడిచిపెట్టారు. ఇందులో ఇప్పటి వరకు 8 చీతాలు మరణించాయి. మరో రెండు చీతాల ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. విదేశాల నుంచి తీసుకొచ్చిన వాటిలో 40శాతం చీతాలు మత్యువాత పడ్డాయని, ఇది మంచి సంకేతం కాదని పేర్కొంది.

అటవీ బిల్లును ఆమోదించొద్దు

- దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అడవుల సంరక్షణపై సవరణ బిల్లును ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో దానిని ఆమోదించవద్దని డిమాండ్ చేస్తూ దేశ రాజధానిలోనూ, 16 రాష్ట్రాలలోనూ ప్రదర్శనలు నిర్వహించారు. ప్రజలు, వాతావరణ పరిరక్షణ బృందాల సభ్యులు పెద్ద సంఖ్యలో నిరసన ప్రదర్శనలకు హాజరయ్యారు. నిరసనకారులు 'భారత అడవులను కాపాడండి' నినాదంతో ఇప్పటికే ఆన్‌లైన్‌లో ప్రచారం చేపట్టారు. బిల్లును ఆమోదించవద్దని రాజకీయ నాయకులు, పార్లమెంట్ సభ్యులను కోరుతూ ఇ-మెయిల్ సందేశాలు కూడా పంపారు. ఢిల్లీ, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకాశ్మీర్, పంజాబ్ తదితర రాష్ట్రాలలో ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, ఛత్తీస్‌ఘర్‌లోని హాస్‌డియోతో పాటు కొల్‌కతా, విశాఖపట్నం నగరాలలో ప్రదర్శనలు జరిగాయి.

గగన్‌యాన్ ఎస్‌ఎంపిఎస్ పరీక్ష విజయవంతం

బెంగళూరు : గగన్‌యాన్‌కు చెందిన సర్వీస్ మాడ్యూల్ ప్రొపల్షన్ సిస్టమ్ (ఎస్‌ఎంపిఎస్)ను ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. తమిళనాడులోని మహేంద్రగిరిలోని ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్‌లో బుధవారం ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో 440 ఎన్ థ్రస్ట్‌తో ఐదు లిక్విడ్ అపోజి మోటార్ (ఎల్‌ఎఎం) ఇంజన్‌లు, 100 ఎన్ థ్రస్ట్‌తో నిండిన 16 రియాక్షన్ కంట్రోల్ సిస్టమ్స్ (ఆర్‌సిఎస్) థ్రస్టర్‌లు ఉన్నాయి. ఎస్‌ఎంపిఎస్ అనేది ఆర్బిటల్ మాడ్యూల్ అవసరాలను తీరుస్తుంది. రాకెట్ ఇంజిన్‌లకు ఆరోహణ దశలో ప్రధాన చోదక శక్తిని అందిస్తుంది. దీంతోనే రాకెట్ ఎగరడం, కక్ష్యలోకి ప్రవేశించడం వంటి చర్యలు జరుగుతాయి. బుధవారం ఎస్‌ఎంపిఎస్ తన పరీక్షను విజయవంతంగా పూర్తి చేయడంతో పాటు, పూర్తి స్థాయి పనితీరును ప్రదర్శించింది. గగన్‌యాన్ ప్రాజెక్టుతో ముగ్గురు వ్యోమగ్యాముల్ని మూడు రోజుల పాటు 400 కిలోమీటర్ల అంతరిక్ష కక్ష్యలోకి ప్రవేశపెట్టి తిరిగి దేశ సముద్ర జలాల్లో దింపడం ద్వారా భూమిపైకి తీసుకుని రావాలని ఇస్రో ప్రణాళిక. ఆగస్టులో గగన్‌యాన్ తొలి అబార్ట్ పరీక్షను నిర్వహించాలని ఇస్రో భావిస్తుంది.

పర్మినెంట్ చేసేంత వరకూ పోరాటం

- రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల ఆందోళనలు
- స్పందించకుంటే 27న మున్సిపల్ కార్యాలయాల ముట్టడి : కె.ఉమామహేశ్వరరావు
- నెల్లూరులో నగరపాలక సంస్థ కార్యాలయాన్ని దిగ్బంధించిన కార్మికులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఏళ్ల తరబడి మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ (ఆప్కాస్) కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ ఆటో డ్రైవర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని మున్సిపల్ కార్మికులు ముట్టడించారు. తొలుత బారాషహీద్ దర్గా నుంచి కార్పొరేషన్ కార్యాలయం వరకు మున్సిపల్ కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సమస్యలు పరిష్కరించేంత వరకు కదిలేదిలేదంటూ కార్మికులు అక్కడే భీష్మించారు. ఉద్యోగులు లోనికి వెళ్లకుండా కార్యాలయాన్ని దిగ్బంధించారు. ధర్నానుద్దేశించి ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేసేంత వరకూ పోరాటం చేస్తూనే ఉంటామని తెలిపారు. ఈ క్రమంలో కార్మికులతో కలిసి వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి స్పందన రాకుంటే జులై 27న రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆందోళనకారులతో మున్సిపల్ కమిషనర్ వికాస్ చర్చలు జరిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. తిరుపతి జిల్లా గూడూరు మున్సిపల్ కార్యాలయం ముందు సామూహిక రిలే నిరాహార దీక్షల్లో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పాల్గొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రిలే దీక్షలు చేపట్టారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో ధర్నా చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మున్సిపల్ కార్యాలయం, ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మహిళా పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా, ఆమదాలవలసలో రిలే దీక్షలు చేపట్టారు. పలాసలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ధర్నాలు చేశారు. గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట దీక్షలు చేపట్టారు. దీక్షలకు సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. కృష్ణా జిల్లాలో పలుచోట్ల ధర్నాలు చేశారు.




నెల్లూరులో నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

తులసీ చందును వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- మహిళా సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తులసీ చందుపై వేధింపులకు దిగుతున్న యూట్యూబ్ ఛానల్ ప్రతినిధులు, అలాగే ఫేస్‌బుక్‌లో విపరీత వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ఐక్యవేదిక కోరింది. ఈ మేరకు విజయవాడ పోలీసు కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. తులసీ చందు పేరుతో యూట్యూబ్ ఛానల్ నడుస్తోందని, దీనిలో పలువురు ఉద్దేశపూర్వకంగా అసభ్యకర పోస్టింగులు పెడుతున్నారని తెలిపారు. అలాగే అహం బ్రహ్మాస్మి, మతోన్మాదంపై రామ బాణం, ఆర్‌జె కిరణ్ యూట్యూబ్, పాస్టర్ పరంజ్యోతి రాజు ఫేస్‌బుక్‌లలో కించపరుస్తూ, అసభ్యకర మెసేజ్‌లు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆమెపై తప్పుడు ప్రచారంతో విద్వేషం కలిగిస్తున్నారని తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. ఆమెపై భౌతిక దాడి జరిగే ప్రమాదమూ ఉందని పేర్కొన్నారు.



వాటిని నివారించాలన్నారు. గరికపాటి నరసింహారావు కూడా తన యూట్యూబ్ ప్రవచనాల్లో మహిళల అంగాంగ వర్ణన చేశారని, అలాంటి వారిపైనా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో దేవి, సంధ్య తదితరుల ఫొటోలను మార్ఫింగ్ చేసి పాస్టర్ పరంజ్యోతి రాజు అవమానకర పోస్టింగులు పెట్టారని ఫిర్యాదులో తెలిపారు. రాజకీయ పక్షాల వారు కూడా ఎదుటి రాజకీయ పక్షాన్ని తిట్టే క్రమంలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని వివరించారు. వారిపైనా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి, నాయకులు స్వరూపరాణి, శ్రీదేవి, సరోజ, పిఓడబ్ల్యు పద్మ, ఎస్‌యుసిఐ లలిత, ఐప్వా నాయకులు నాగమణి ఉన్నారు.

పోలీసు కస్టడీలో 'మార్గదర్శి' బిఎం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

విజయవాడ లబ్బీపేటలోని మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ కాంతి రాణా టాటా తెలిపారు. నగరానికి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపిసి 409, 420 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని చెప్పారు. బ్రాంచ్ మేనేజర్‌తోపాటు సంస్థ యాజమాన్యం పైనా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

'చంద్రబాబుపై సిఐడి కేసు కొట్టేయండి'

ప్రజాశక్తి-అమరావతి

రాజధాని అమరావతి భూముల విషయంలో మాజీ సిఎం, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, మాజీ మంత్రి పి నారాయణపై సిఐడి నమోదు చేసిన కేసుల్ని కొట్టేయాలని వాళ్ల తరపున సీనియర్ అడ్వకేట్ దమ్మాలపాటి శ్రీనివాస్ హైకోర్టులో గురువారం వాదించారు. అనంతరం విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

మళ్లీ కదం తొక్కిన ఓపెనర్లు

వెస్టిండీస్‌తో రెండో టెస్ట్



రోహిత్ శర్మ జైస్వాల్ సెంచరీ భాగస్వామ్యం

ట్రినిడాడ్: వెస్టిండీస్‌తో ప్రారంభమైన రెండో టెస్ట్‌లోనూ భారత ఓపెనర్లు కదం తొక్కారు. డొమినికా వేదికగా జరిగిన తొలిటెస్ట్‌లో జైస్వాల్, రోహిత్ శర్మ కలిసి తొలి వికెట్‌కు 229పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పగా.. గురువారం నుంచి ప్రారంభమైన రెండో టెస్ట్‌లో 35 ఓవర్లలో జైస్వాల్(57) వికెట్ కోల్పోయి 150 పరుగులు చేసింది. ఆ సమయానికి క్రీజ్‌లో రోహిత్ శర్మ(78), శుభ్‌మన్(8) ఉన్నారు. లంచ్ విరామ సమయానికి భారతజట్టు వికెట్లేమీ నష్టపోకుండా 121 పరుగులు చేసింది. ఆ సమయానికి రోహిత్ శర్మ 102 బంతుల్లో 6ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 63 పరుగులు చేస్తే.. జైస్వాల్ కేవలం 56బంతుల్లోనే 8ఫోర్లు, ఓ సిక్సర్‌తో 52పరుగులు చేశారు. తొలుత టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ బ్రాత్‌వైట్ ఫీల్డింగ్ ఎంచుకొన్నాడు.

కోహ్లి @ 500 అంతర్జాతీయ మ్యాచ్‌లు

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి ఓ మైలురాయికి చేరాడు.. అంతర్జాతీయ క్రికెట్‌లో 500 మ్యాచ్‌లు పూర్తిచేసుకున్న ఆటగాడిగా నిలిచాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్‌లలో కలిసి 500కు పైగా మ్యాచ్‌లు ఆడిన భారత్ తరఫున 3వ, ఓవరాల్‌గా 10వ ఆటగానిగా కోహ్లి ఈ మైలురాయిని అందుకున్నాడు. కోహ్లి కంటే ముందు 500కు పైగా మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లలో సచిన్, ఎంఎస్ ధోనీ, రాహుల్ ద్రావిడ్ ముందున్నారు. అంతర్జాతీయంగా 500కు పైగా మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లు.. సచిన్(664), జయ వర్ధనే(652), సంగక్కర(594), జయసూరియ (586), రికీ పాంటింగ్(560), ఎంఎస్ ధోనీ(538), షాహిద్ అఫ్రిది(524), జాక్ కల్లిస్(519), రాహుల్ ద్రావిడ్ (509), విరాట్ కోహ్లి(500) కంటే ముందున్నారు.

క్వార్టర్స్‌కు చిరాగ్-సాత్విక్ జోడి

- ప్రణయ్, ప్రియాంశు ఓటమి
- కొరియా ఓపెన్ సూపర్-300



సియోల్: కొరియా ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగియగా.. పురుషుల డబుల్స్‌లో చిరాగ్‌శెట్టి-సాత్విక్ సాయిరాజ్ రంకిరెడ్డి జోడీ క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో చిరాగ్-సాత్విక్ జంట 21-17, 21-15తో 5వ సీడ్, జపాన్‌కు చెందిన టకురో-యుగో కొబయాషీపై విజయం సాధించారు. క్వార్టర్స్‌లో భారత జంట చైనాకు చెందిన టింగ్-జో యంగ్‌లతో తలపడనున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో రెండోరౌండ్ పోటీలో హెచ్‌ఎస్ ప్రణయ్ రాయ్, ప్రియాంశు రాజవత్ ఓటమిపాలయ్యారు. ప్రణయ్ 15-21, 21-19, 18-21తో హాంకాంగ్‌కు చెందిన లీ-చౌక్-యు చేతిలో, ప్రియాంశు 14-21, 21-19, 17-21తో జపాన్‌కు చెందిన నరోకా చేతిలో ఓడారు. ఇక మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రీ గోపీచంద్ జోడీ 11-21, 4-21తో కేవలం 33 నిమిషాల్లోనే కొరియా జోడీ చేతిలో ఓడి ఇంటిదారి పట్టారు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ కపూర్-సిక్కిరెడ్డి జంట 15-21, 12-21తో చైనాకు చెందిన ఫెంగ్ యన్-హుయాంగ్ డెంగ్ పింగ్ చేతిలో వరుససెట్లలో ఓడారు.

పాక్‌దే తొలిటెస్ట్

శ్రీలంకపై నాలుగు వికెట్ల తేడాతో గెలుపు

గాలే: శ్రీలంకతో జరిగిన తొలిటెస్ట్‌లో పాకిస్తాన్ జట్టు నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓవర్ నైట్ స్కోర్ 4వికెట్ల నష్టానికి 131పరుగులతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాక్ జట్టు శ్రీలంక నిర్దేశించిన 208పరుగుల లక్ష్యాన్ని 6వికెట్లు కోల్పోయి ఛేదించింది. పాక్ గెలుపులో సౌద్ షకీల్ కీలకపాత్ర పోషించాడు. దీంతో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో పాక్ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. అరంగేట్రం ఆటగాడు షకీల్ డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. దీంతో పాక్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 461పరుగులు చేయడంతో ఆ జట్టు 149పరుగుల ఆధిక్యతను సంపాదించిన అఘా సల్మాన్‌తో కలిసి 177పరుగుల భాగస్వామ్యాన్ని, నెలకొల్పాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ షకీల్‌కు లభించగా.. 2వ, చివరి టెస్ట్ కొలంబో వేదికగా సోమవారం నుంచి ప్రారంభం కానుంది.

ఫుట్‌బాల్ జట్టుకు 99వ ర్యాంక్

- 29ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి
- ఫిఫా ర్యాంకింగ్స్ విడుదల

రోమ్: ఫిఫా తాజా ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల ఫుట్‌బాల్ జట్టు సత్తా చాటింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య(ఫిఫా) గురువారం ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకొని 99వ స్థానంలో నిలిచింది. 1996 తర్వాత 100లోపు ర్యాంక్‌లో నిలవడం ఇదే తొలిసారి.అప్పట్లో 94వ ర్యాంక్‌లో నిలిచింది. అలాగే ఆసియాఖండంలో 18వ ర్యాంక్‌కు ఎగబాకింది. ఇటీవల ముగిసిన శాఫ్ ఛాంపియన్‌షిప్‌తో పాటు ఇంటర్ కాంటినెంటల్ కప్ గెలుచుకోవడంతో భారత్ ఖాతాలో 2పాయింట్లు జమ కావడంతో ర్యాంక్ మెరుగైంది.

ఇంగ్లండ్ 384/4

మాంచెస్టర్: యాషెస్ సిరీస్ నాల్గో టెస్ట్‌లో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు పట్టు బిగించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియాను 317పరుగులకు పరిమితం చేసిన ఇంగ్లండ్ జట్టు.. రెండోరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 384పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలే(189) భారీ శతకానికి తోడు మొయిన్ అలీ(54), రూట్(76నాటౌట్) అర్ధసెంచరీలతో రాణించాడు. ఆట ముగిసే సమయానికి స్టోక్స్(24), బ్రూక్(14) క్రీజ్‌లో ఉన్నారు. స్టార్క్‌కు రెండు, గ్రీన్‌కు ఒక వికెట్ దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68